పోస్టల్ బ్యాలెట్‌కు పోటెత్తిన ఓటర్లు

పోలింగ్ కేంద్రాల్లో ఎండ వేడిమికి తోడు సదుపాయాల కొరతతో అల్లాడిన ఉద్యోగ,ఉపాధ్యాయులు

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేసేందుకు ఉద్యోగులు పోటెత్తారు.గతంలో వారి నుంచీ బ్యాలెట్ పత్రాలు చాలావరకూ ప్రధాన పార్టీల అభ్యర్థులే సేకరించి పోస్టులో పంపడం జరిగేది. ఈసారి దానికి భిన్నంగా ఉద్యోగులే ముందస్తుగా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిన సంగతి తెలిసిందే. సాధారణంగా ఓటు వేయడానికి పెద్దగా ముందుకు రాని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ పర్యాయం పట్టుదలగా, కసిగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చినట్టు కనిపించింది. అయితే ఎండ వేడిమికి తోడు సదుపాయాల కొరతతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు.


మహిళావర్సిటీలో


ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో

తొలిరోజు పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు		
సెగ్మెంట్	ఎన్నికల విధుల ఓటర్లు	అత్యవసర సర్వీసుల ఓటర్లు
గూడూరు	1053	025
సూళ్ళూరుపేట	915	007
వెంకటగిరి	1240	016
తిరుపతి	2187	041
శ్రీకాళహస్తి	1561	036
సత్యవేడు	747	032
చంద్రగిరి	1800	051
ఇతర జిల్లాల	2478	208
మొత్తం	11894	416


పోలింగ్ కేంద్రం వద్ద పార్టీ కండువాలతో వైసీపీ శ్రేణులు

చంద్రగిరి పోలింగ్ కేంద్రం ఎదుట పులివర్తి నానీ ధర్నా

తిరుపతి పద్మావతీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన చంద్రగిరి నియోజకవర్గ పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచే ఓటర్లు భారీగా క్యూలైన్‌లో బారులు తీరారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు ఎండ వేడిమికి, ఉక్కపోతకూ మహిళా ఓటర్లు క్యూలైన్‌లో ఇబ్బంది పడ్డారు. పలువురు ఓటర్లు క్యూలైన్‌లో ఉండలేక ఓ దశలో కేంద్రంవైపు తోసుకుని వెళ్ళారు. వారిని అదుపుచేసేందుకు పోలీసులు అవస్థ పడ్డారు. ఆ సందర్భంగా ఓటర్లకు పోలీసులకు నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. కొందరు ఎండలో ఉండలేక ఓటు వేయకుండానే తిరిగి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిని గమనించిన టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఓటర్లకు తగిన సౌకర్యాలు కల్పించలేదని ఆరోపిస్తూ పోలింగ్ కేంద్రం ఎదుట అనుచరులతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో నిషాంత్ రెడ్డి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కూడా సందర్శించారు. కేంద్రం బయట ఓటర్లను ఇరుపార్టీ నాయకులు ఓట్లు అభ్యర్థిస్తూ కనిపించారు.



తిరుపతిలో పోలీసులతో సీపీఐ నేతల తోపులాట

తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన తిరుపతి నియోజకవర్గ పోలింగ్ కేంద్రం వద్ద సీపీఐ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఓటర్లకు సీపీఐ నాయకులు అడ్డుగా ఉన్నారంటూ పోలీసులు నెట్టడంతో ఈ వివాదం తలెత్తింది. వాగ్వాదం ముదిరి పోలీసులు, సీపీఐ నాయకులు పరస్పరం తోపులాటకు దిగారు. కాగా ఈ కేంద్రం వద్ద ఇరు పార్టీ నేతలు ప్రచారంతో హడావుడి చేశారు. ఎండకు చల్లగా ఫ్యాన్‌కి ఓటేయమని వైసీపీ నేతలు, ఎండకు చల్లని నీరును గ్లాసులో తాగాలంటూ కూటమి నేతలు ఉద్యోగులను అభ్యర్థించారు. మరోవైపు ఓటర్లు లైన్‌లో లేరని, ఉంటేనే సంతకాలు చేస్తానంటూ విధుల్లోని ఓ అధికారి సంతకం చేయకుండా లేచివెళ్లిపోయారు. సీఎం జగన్ స్టిక్కర్‌తో కూడిన కారు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడం విమర్శలకు దారి తీసింది.


ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బయట ఓటర్లకు నేతల అభ్యర్థనలు

సత్యవేడులో ఆర్వోకు వ్యతిరేకంగా నినాదాలు

సత్యవేడు పోలింగ్ కేంద్రం వద్ద సదుపాయాల కొరతతో మండిపడిన ఉద్యోగులు రిటర్నింగ్ అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 1,366 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నాలుగు మండలాల ఉద్యోగులకు ఒకే గదిని కేటాయించడంతో ఎక్కువ సమయం వేచి వుండాల్సి వచ్చింది. ఎండ వేడికి, ఉక్కపోతకు విసిగిపోయిన ఉద్యోగులు ఓటర్ల సంఖ్యకు సరిపడా సదుపాయాలు కల్పించలేదంటూ రిటర్నింగ్ అధికారిపై మండిపడ్డారు. ఆర్వోకు వ్యతిరేకంగా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.కనీసం తాగేందుకు నీరు,కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. సరైన వసతులు లేనికారణంగా కొందరు ఉద్యోగులు ఇంటికే పరిమితమయ్యారు. ఇక, పుత్తూరులో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని మంత్రి రోజా సందర్శించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

పుత్తూరులో పోలింగ్ కేంద్రమున్నా తిరుపతికి ఉద్యోగుల కేటాయింపు

ఇతర జిల్లాల్లో ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉద్యోగుల కోసం తిరుపతి ఎస్వీ క్యాంపస్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నగరి నియోజకవర్గానికి సంబంధించి ఉద్యోగులకు పుత్తూరులో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ పలువురు అక్కడి ఉద్యోగులను ఓటింగ్ కోసం తిరుపతిలోని ఈ కేంద్రానికి పంపించారు. దీనిపై సంబంధిత ఉద్యోగుల నుంచీ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పుత్తూరులో పోలింగ్ కేంద్రం వున్నా తమను తిరుపతికి ఎందుకు పంపిస్తున్నారని వారు ప్రశ్నించారు. కాగా ఈ కేంద్రాన్ని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌రెడ్డి, మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి సందర్శించారు.

పోలీసులతో బొజ్జల సుధీర్ వాగ్వాదం

శ్రీకాళహస్తి పోలింగ్ కేంద్రం గేటు వద్ద పరిమితికి మించి వైసీపీ వారిని అనుమతించడంపై టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గేటు వద్ద పదిమంది కంటే ఎక్కువమంది ఉండకూడదని నిబంధన పెట్టిన డీఎస్పీ వైసీపీ వారిని మాత్రం వందల సంఖ్యలో అనుమతించడం వివాదానికి కారణమైంది. పోలింగ్ కేంద్రం గేటు వద్ద వుండి ఇంతమంది ప్రచారం చేయడాన్ని ఎలా అనుమతించారంటూ సుధీర్ నిలదీశారు. దీంతో కొంతసేపు పోలీసులకూ, ఆయనకు మధ్య వాగ్వాదం జరిగింది. ఉద్యోగులు పోలింగ్‌కు వెళ్లే సమయంలో ప్రచారం చేస్తున్న వైసీపీ, టీడీపీ నాయకులు కూడా వాగ్యుద్ధానికి దిగారు. మరోవైపు రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి నిర్వహిస్తున్న పోలింగ్‌లో ఓటర్లకు సదుపాయాలు ఎక్కడున్నాయని సుధీర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు.కూర్చోవడానికి కుర్చీలు, తాగు నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎలక్షన్ డబ్బును ఏం చేశారని ప్రశ్నించారు. కాగా వైసీపీ నాయకులు కొంత మంది పార్టీ కండువా కప్పుకుని ప్రచారం చేయడం గమనార్హం. బొజ్జల రిషిత రెడ్డి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఇక పోలింగ్ కేంద్రం ముందు టీడీపీ,వైసీపీ నేతలు పోటాపోటీగా టెంట్లు వేసుకుని తిష్టవేశారు.


పోలీసు అధికారులను ప్రశ్నిస్తున్న సుధీర్ రెడ్డి

నేడు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

- 13న పోలింగ్ బూతుల్లోకి సెల్‌ఫోన్‌కి అనుమతిలేదు
- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్


ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో పోలింగును పరిశీలిస్తున్న కలెక్టర్,కమిషనర్

తిరుపతి కలెక్టరేట్/రూరల్, మే 5: పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోని ఉద్యోగులు సోమవారం కూడా ఓటు వేయవచ్చని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ స్ట్రాంగ్‌రూమ్‌లో అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల ఈవీఎంల కమిషనింగ్‌ని ఆదివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగిందన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లతోపాటు పోలింగ్ ఏజెంట్లు, ప్రభుత్వం తరఫున ఉన్న వీడియోగ్రాఫర్లు కూడా పోలింగ్ బూత్‌లలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. అయితే సెక్టార్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్‌కు మాత్రమే ఫోన్ అనుమతి ఉందని.. వారు కూడా స్విచ్ ఆఫ్ చేసి తమవద్ద ఉంచుకోవాలని తెలిపారు. ఈవీఎంలు పనిచేయకుంటే ఆ విషయం తెలియజేసేందుకు మాత్రమే ఫోన్‌ని ఆన్‌చేసి విషయం చెప్పాక ఆఫ్ చేసేయాలని ఆదేశించామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్ డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీడియా సిబ్బందికి పోలింగ్ బూత్ వద్ద ఓటర్లు నిలబడి ఉన్న క్యూలైన్ల వరకు మాత్రమే అనుమతి ఉందని, లోపలికి అనుమతి లేదని స్పష్టం చేశారు. మీడియాను అనుమతించే విషయమై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం కమిషనింగ్ కార్యక్రమం పూర్తి చేస్తున్నామని, 12వతేదీన పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సామగ్రి పంపిణీ ఉంటుందని వివరించారు. తిరుపతి అసెంబ్లీ ఆర్వో అదితిసింగ్, పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ఉజ్వల్‌కుమార్ ఘోష్ పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన

ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసి, చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్‌ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. అలాగే పార్లమెంటుకు సంబంధించి ఈవీఎంల రెండో దఫా ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టరేట్‌లో నిర్వహించారు. రాజకీయపార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోనివారికి మరో అవకాశం

ఫారం-12తో సకాలంలో దరఖాస్తు చేసుకోని వారికి ఈ నెల 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కి ఎన్నికలసంఘం మరో అవకాశం ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, కొన్ని కారణాలతో తిరస్కరించబడిన వారు కూడా ఈ రెండ్రోజుల్లో సంబంధిత ధ్రువపత్రాలతో ఓటింగ్ సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు.

నేడు, రేపు హోంఓటింగ్

ఇంట్లోనే ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్న 85ఏళ్లు దాటిన వృద్ధులకు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు సోమ, మంగళవారాల్లో హోం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ తెలిపారు.

మహిళా వర్సిటీ పోలింగ్ కేంద్రంలో అవస్థలు

తిరుపతి(వైద్యం), మే 5: మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు తిప్పలు తప్పలేదు. ఓటింగ్ ప్రక్రియే 11.30గంటల దాకా ప్రారంభం కాలేదు.మధ్యాహ్నం 3 గంటల సమయానికి వెయ్యి ఓట్లు కూడా పోల్ కాకపోవడం, ఉద్యోగులు భారీగా క్యూలో ఉండడంతో క్యూలో నిల్చోలేక పలువురు ఉద్యోగులు ఓటు వేయకనే వెనుదిరిగి వెళ్లారు.ఈ క్రమంలో రాత్రి 7 గంటలకు చీకటి అలుముకోవడంతో పోలింగ్ కేంద్రంలో తప్ప బయట లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు చీకట్లో వేచి ఉండాల్సి వచ్చింది. ఓ పక్క ఉక్కపోత, మరో పక్క చిమ్మ చీకట్లతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.ఎట్టకేలకు రాత్రి 9 గంటల సమయంలో ఓట్ల ప్రక్రియ ముగిసింది. ఆ సమయానికి 2091మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


చీకట్లో కూర్చొనివున్న ఉద్యోగులు

నీట్‌కు 97.37శాతం హాజరు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 5: అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ (ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంసెస్) కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం జరిగిన జాతీయ స్థాయి పరీక్ష నీట్ యూజీ-2024 ప్రశాంతంగా ముగిసింది. తిరుపతి పరిదిలోని తొమ్మిది కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 97.37 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్ కైలాష్‌నాథ్ తెలిపారు. మొత్తం 4,692 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4,569 మంది హాజరయ్యారు. బోటనీ ప్రశ్నలు నిడివి ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు వాటిని చదివేందుకే ఎక్కువ సమయం పట్టిందని, వాటికి పూర్తిస్థాయిలో జవాబులు రాసేందుకు సుమారు 1.30 గంట సమయం తీసుకుందని విద్యార్థులు చెప్పారు. ఇక జంతు శాస్త్రం పేపర్ సులభంగా వచ్చిందని, రసాయన శాస్త్రం కష్టంగా, భౌతికశాస్త్రం ప్రశ్నలు మరింత కఠినంగా ఉన్నాయని విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా చెప్పారు.

గూడూరులో అయోమయం

గూడూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నీట్‌కు హాజరైన విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. పరీక్షకు సంబంధించి అందించాల్సిన ప్రశ్నపత్రం ఓ సెట్‌కు బదులు వేరేది అందజేశారు. 15 నిమిషాల తరువాత గుర్తించిన అధికారులు ప్రశ్నపత్రాలను తీసుకుని మరో సెట్‌ను ఇచ్చారు. ఈ క్రమంలో 15 నిమిషాల సమయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు తిరుపతికి చంద్రబాబు, పవన్

లీలామహల్ నుంచి నాలుక్కాళ్ల మండపం వరకు రోడ్ షో, బహిరంగ సభ

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళవారం తిరుపతిలో పర్యటించనున్నారు. లీలామహల్ సర్కిల్ నుంచి దేవేంద్ర థియేటర్, తిలక్ రోడ్డు మీదుగా నాలుక్కాళ్ల మండపం వరకు రోడ్ షో జరగనుంది. నాలుక్కాళ్ల మండపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కూటమి నేతలు ఓ హోటల్లో సమావేశమయ్యారు. ఇద్దరి నేతల పర్యటన విజయవంతానికి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించుకున్నారు. తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, చిట్టిబాబు, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, భట్టే వెంకట కీర్తి, అన్నా సంధ్య, చినబాబు, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, పుష్పావతి, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఏఎం రత్నం, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుడి ఇంటిపై దాడి

- గంజాయి మత్తులో గేటు ధ్వంసం చేసి....


అసభ్యకరంగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు



కిషోర్‌ను పరామర్శిస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, నాయకులు - ధ్వంసమైన ఇనుప గేటు

తిరుపతి(నేరవిభాగం), మే 5: తిరుపతిలోని వెంకటరెడ్డి కాలనీ నివాసం ఉంటున్న జనసేన కార్యకర్త కిషోర్ ఇంటిపై వైసీపీకి చెందిన నాయకుడు కొడుకు జానీ, మరికొందరు మద్యం, గంజాయి సేవించి ఆదివారం రాత్రి మూకుమ్మడిగా దాడి చేశారు.ఈ దాడిలో తమ ఇంటి గేటును ధ్వంసం చేయడమేకాక,మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.'మీరు జనసేన పార్టీ తరఫున ఎలా ప్రచారం చేస్తారో మేము చూస్తాం. మీరు ప్రచారం చేస్తే మీ అంతు చూస్తాం' అని బెదిరించినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, నాయకులు హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, తదితరులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భయాందోళనతో ఉన్న బాధితులను ఓదార్చారు. మరోవైపు పోలీసులు వస్తున్నారని తెలియడంతో వైసీపీ శ్రేణులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి, పోలీసులు చేరుకోగా.. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆరణి, కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. లేకుంటే మళ్లీ వచ్చి దాడి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తాము ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే.. వైసీపీ శ్రేణులు మాత్రం రణరంగం సృష్టిస్తున్నాయని వారిపై గట్టిగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

విధిగా ఓటు హక్కును వినియోగించుకోండి


ఓటెయ్యండంటున్న శివాజి

తిరుపతి అర్బన్, మే 5: నిర్లక్ష్యం చేయకుండా విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రముఖ సినీ నటుడు శివాజి చేతులు జోడించి ఓటర్లను వేడుకున్నారు. తిరుపతిలోని తిరుమల బైపాస్‌రోడ్డులో తన మిత్రులు రితిన్‌సాయి, కల్యాణ్, కావ్య ఏర్పాటు చేసిన దొన్నె బిర్యానీ హౌస్‌ను ఆదివారం మధ్యాహ్నం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇంట్లో కూర్చోకుండా దయచేసి ఓటు వేయడానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. పిఠాపురంలో జనసేనాని పవన్‌కల్యాణ్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని జోస్యం చెప్పారు.పవన్‌కల్యాణ్‌కు ప్రజాసేవ చేయడం మాత్రమే తెలుసునని, సినిమాకు రూ. వంద కోట్లు పారితోషికం తీసుకొనే పవన్‌కల్యాణ్ డబ్బులకోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు. రాష్ట్రాన్ని ఎవరు దోచుకున్నారో, ఎవరు దాచుకున్నారో ప్రజలకు తెలుసన్నారు. ప్రజాధనాన్ని దోచేసిన నేతలను ఓటర్లు నమ్మబోరన్నారు. చంద్రబాబు పరిపాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. జగన్ పాలన ఏ విధంగా గడిచిందో చెప్పవలసిన అవసరం లేదన్నారు.ఉద్యోగులు డబ్బులు తీసుకొని ఓట్లేయడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు.ప్రస్తుతం విలన్‌గా ఓ సినిమా, హీరోగా ఒక సినిమాలో నటిస్తున్నట్లు వెల్లడించారు.

సుందరరాజస్వామికి వేడుకగా తిరువీధి ఉత్సవం



తిరుచానూరు, మే 5: తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామికి ఆదివారం రాత్రి అత్యంత వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వ అలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, మే 5: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన కృష్ణామృత డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నగరవాసులను అలరించింది. పుష్పాంజలి, గురుబ్రహ్మ... గురు విష్ణుః, కల్యాణరామ, మహాలక్ష్మి అష్టకం, అయిగిరి నందిని వంటి కీర్తనలకు కళాకారులు అమృతవల్లి, కార్తీక్ నాయక్, బిందులత, ఉపాసన, ధరణి, జాహ్నవి, మేఘన తదితరులు ప్రదర్శించిన నృత్యం నగరవాసులను ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

ముగిసిన ఏపీఆర్‌సెట్

- 86 శాతం హాజరు, 15న ఫలితాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. 10,050 మంది దరఖాస్తు చేయగా, ఇందులో 8,651 మంది హాజరయ్యారు. హైదరాబాదుతో పాటు రాష్ట్రంలోని 17 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్టు ఏపీఆర్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వెల్లడించారు. 86.5శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఈనెల 15వ తేదీన ఫలితాలు విడుదల చేస్తామన్నారు. జూన్‌లో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్లు హేమ, కుసుమ హరినాథ్, కుమారస్వామి పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి


రాజువారిపల్లెలో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

భాకరాపేట, మే 5: రాబోయే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించాలని చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని రాజువారిపల్లె, ఎండపల్లెవారిపల్లె హరిజనవాడ గ్రామాల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, బావాజాన్, చోటా సాహెబ్, సాధిక్, అబ్దుల్ మజీద్, ఎర్రయ్య నాయుడు, రాజగోపాల్ నాయుడు, ఖాకి వెంకటరమణ, షబాబ్ బాషా, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సంకీర్తనల సీడీ ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్) మే 5: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మపై సంకీర్తనలతో రూపొందించిన సీడీని ఆదివారం గంగమ్మ ఆలయంలో ఆవిష్కరించారు. విశాఖపట్టణంలోని శ్రీజగత్కళ్యాణ పీఠం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రచయిత కొరుపోలు వేంకటపతి రూపొందించిన ఈ ఆడియో సీడీని తాళ్లపాక వంశం 12వ తరానికి చెందిన శ్రీహరి నారాయణాచార్యులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో రోటరీ సహాయ గవర్నర్ చిరిపిరెడ్డి కరుణానిధి, గంగమ్మ ఆలయ ఈవో మమత, పాలక మండలి అధ్యక్షుడు కట్టా గోపియాదవ్, రచయిత కొరుపోలు వేంకటపతి, ప్రముఖ గాయకులు పారుపల్లి రంగనాథ్, ఆకాశవాణి విశ్రాంత అధికారి ఆకుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. కాగా తిరుపతి, కరకంబాడికి చెందిన శ్రీకనకమహాలక్ష్మి పీఠం వారు కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


వెంకట్ కామత్, డైరెక్టర్ల బృందం


గోపాలస్వామి, పీఎంఎస్ ప్రసాద్

తిరుమల, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. డీఆర్‌డీవో చైర్మన్ వెంకట్ కామత్, పలు విభాగాల డైరెక్టర్ల బృందం, ఎన్నికల మాజీ చీఫ్ కమిషన్ గోపాలస్వామి, రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

చంద్రగిరి

వైసీపీ డివిజన్ అధ్యక్ష పదవికి బాబుయాదవ్ రాజీనామా

● నేడు టీడీపీలో చేరిక



రామచంద్రాపురం, మే 5: యాదవ సంఘం నాయకులు, మాజీ జడ్పీటీసీ గౌరీ భర్త బాబు యాదవ్ ఆర్‌సీపురం వైసీపీ డివిజన్ అధ్యక్ష పదవికి ఆదివారం రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం పులివర్తి నాని సమక్షంలో బాబుయాదవ్‌తో పాటు టీడీపీ జిల్లా నాయకులుగా ఉండి ఐదేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నవారు కూడా చేరనున్నట్లు సమాచారం. టీడీపీ ఎంపీపీల జిల్లా మాజీ ఫ్లోర్ లీడర్, ప్రముఖ పారిశ్రామికవేత్త కేశవ నాయుడుతో పాటు ఆయన అనుచరులు పార్టీ కండువా కప్పుకోనున్నారు.

టీడీపీ విస్తృత ప్రచారం


గంగిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మే 5: మండలంలోని 23 పంచాయతీల్లో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రామాపురంలో జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మునిరామిరెడ్డి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యేగా పులివర్తి నానీని గెలిపించాలని కోరారు. రాయలచెరువుపేటలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, అనుపల్లెలో మాజీ ఎంపీపీ బిందుమాధవి, గంగిరెడ్డిపల్లెలో యువత జిల్లా ప్రధాన కార్యదర్శి ఢిల్లీనాథరెడ్డి, కమ్మకండ్రిగలో జనార్ధన్‌చౌదరి, గణేశ్వరపురంలో మాజీ సర్పంచ్ మురళీ నాయుడు, పుల్లమనాయుడు కండ్రిగలో మురళీమోహన్, నెత్తకుప్పంలో జిల్లా కార్యదర్శి జేడీజగన్, చిట్టత్తూరులో చిరంజీవిరెడ్డి, రామానాయుడు కండ్రిగలో హరిప్రసాద్, నెన్నూరులో మాజీ వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాని గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు.

మాదిగలు ఏ పార్టీలో ఉన్నా... ఎన్డీయే అభ్యర్థులకు ఓటు వేయండి

● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు

● ఒక్క అవకాశం ఇవ్వండి.. మాదిగలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేస్తా: పులివర్తి నాని


పులివర్తి నాని, మంద కృష్ణ మాదిగలను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రగిరి, మే 5: మాదిగలు ఏపార్టీలో ఉన్నా ఎన్డీయే అభ్యర్థులకు ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం చంద్రగిరిలో మాదిగల ఆత్మీయ సదస్సు జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని హాజరయ్యారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ గత నవంబరులో జరిగిన మాదిగల ఎస్సీ వర్గీకరణకు ఎన్డీయే కట్టుబడి ఉందని తెలియజేశారు. అందులో భాగంగా ఎన్డీయే కూటమికి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మార్పీఎస్ మద్దతు ఇచ్చినట్లు చెప్పారు. కూటమిలో భాగస్వాములైన టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ఏపీలో అధికారంలోకి వస్తే మాదిగలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. అధికార వైసీపీ ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో రాజ్యాంగం విరుద్ధమని మాట్లాడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించుకోవడానికి మాదిగలు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పులివర్తి నాని మాట్లాడుతూ.. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాదిగలు ఐక్యతతో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరిపాక వాసుదేవరావు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర, నాయకులు పులికుంట్ల గోపి మాదిగ, బోయనపల్లి రవి, పల్లిపాగు నాగరాజు మాదిగ, మార్గాల ప్రసాద్, గడ్డం లక్ష్మయ్య, జ్ఞానశేఖర్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

● న్యాయం చేయాలని ప్రియుడి ఇంటి ముందు బాధితురాలి ఆందోళన


ప్రియుడి ఇంటిముందు ఆందోళన చేస్తున్న గ్రీష్మ, వివరాలు తెలుసుకుంటున్న పాకాల పోలీసులు

పాకాల, మే 5: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పాలినేనివారిపల్లెలో ప్రియుడి ఇంటిముందు బంధువులతో కలిసి బాధితురాలు ఆదివారం ఆందోళనకు దిగారు. బాధితురాలి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా కాణిపాకం పండారం వీధిలో ఉంటున్న కామిదాయనిపల్లె సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కేసీ గ్రీష్మ, 35.యర్రంపల్లె సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పాకాల మండలం పాలినేనివారిపల్లెకు చెందిన కె.మున్నాముతిక్‌లు పాకాల హైస్కూల్‌లో, ఆపై బీటెక్‌లో కలిసి చదువుకున్నారు. 2019లో ఐరాల మండలంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లుగా నియమితులయ్యారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడని.. గర్భిణీ రావడంతో పెళ్లిచేసుకుందామని అడిగితే, చెల్లెలి పెళ్లి అయ్యాక చేసుకుందామని చెప్పి తిరుపతి ప్రైవేటు ఆస్పత్రిలో భర్త అని చెప్పి అబార్షన్ చేయించాడు. ఆపై పెళ్లి చేసుకోవాలని గట్టిగా అడగడంతో మతం మార్చుకుంటే మా ఇంట్లో ఒప్పిస్తానని చెప్పాడు. గత యేడాది డిసెంబరులో మతం మార్చుకున్నా పెళ్లి చేసుకోకుండా కాలయాపన చేస్తున్నాడు. ఇరువర్గాల కులపెద్దలతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. స్నేహితుడిగా వుండి ప్రేమ పేరుతో శారీరకంగా వాడుకొని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఇప్పుడు కులం తక్కువ అని, నీవెవరో తెలియదని అంటున్నాడని.. తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు ప్రియుడి ఇంటిముందు బైఠాయించారు. పాకాల పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


శంఖంపల్లె వద్ద లారీని మినీలారీ ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన సురేష్ (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

పాకాల, మే 5: చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారి పాకాల మండలం శంఖంపల్లె సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సూళ్లూరుపేట నుంచి రాత్రి ఒంటి గంటకు చెప్పుల లోడుతో మైసూరుకు బయలుదేరిన మినీ లారీ శంఖంపల్లె సమీపంలో తెల్లవారుజామున ముందు ఆగివున్న లారీని వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు వేలూరుకు చెందిన మినీ లారీ డ్రైవర్ వి.సురేష్ (49) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకోసం తిరుపతికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా టోల్‌గేట్ సమీపంలో మృతిచెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పాకాల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి రూరల్ మండలంలో వైసీపీకి బిగ్‌షాక్

- పలు పంచాయతీల్లో వైసీపీని వీడి టీడీపీలో చేరికలు


పెరుమాళ్లపల్లెకి చెందిన వైసీపీ నేతలతో పులివర్తి నాని, కత్తి సుధాకర్, శ్రీనగర్‌కాలనీకి చెందిన వైసీపీ నేతలతో నాని, ఈశ్వర్‌రెడ్డి

తిరుపతి రూరల్, మే 5: ఎన్నికలకు పట్టుమని వారంరోజుల వ్యవధికూడా లేని సమయంలో తిరుపతి రూరల్‌మండలంలో అధికార వైసీపీకి ఆపార్టీనేతలు వరుసగా బిగ్ షాక్ ఇస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు పంచాయతీల్లో కీలకనేతలు వరుసపెట్టి టీడీపీ తీర్థం పుచ్చుకోగా.. తాజాగా ఆదివారం కూడా పలు పంచాయతీలకు చెందిన వైసీపీ నేతలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతుండటం గమనార్హం. వీరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ఉమ్మడిపార్టీ నేతలు పాల్గొన్నారు.

● తనపల్లెలో: తనపల్లెకి చెందిన మాజీ ఎంపీటీసీ రాంప్రసాద్‌రెడ్డి, సుజన్‌కుమార్‌రెడ్డి, తేజారెడ్డి, కొత్రమంగళంకి చెందిన ఎన్.సుబ్రమణ్యంరెడ్డి, సీబీ రాజశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లం జగదీశ్‌రెడ్డిలు ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

● సి.మల్లవరంలో: సి.మల్లవరం పంచాయతీకి చెందిన శంకర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, గోపిరెడ్డి, రమేష్, దొరస్వామిరెడ్డి, సురేష్‌రెడ్డి, కుప్పిరాజురెడ్డి, రాజేష్‌రెడ్డి, నాదమునిరెడ్డి, రామచంద్రయ్యలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో వైసీపీని వీడి సైకిలెక్కారు. వీరికి నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మనోహర్‌చౌదరి, రవిచంద్ర నాయుడు, అశోక్, భాస్కర్, జానకి పాల్గొన్నారు.


తనపల్లెలో టీడీపీలో చేరిన వారికి పసుపు కండువా కప్పుతున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి, ఓటేరులో పులివర్తి వినీల్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

● పెరుమాళ్లపల్లె పంచాయతీలో: పెరుమాళ్లపల్లె పంచాయతీ పరిధిలో గాంధీపురానికి చెందిన బాలాజి, అశోక్, జ్ఞానేంద్ర, వెంకటాద్రి, వంశీ, ప్రకాశ్, నాగార్జున, చిన్నరాయుడు, రవితేజ, సాయితేజలు నాని సమక్షంలో టీడీపీలో చేరారు. యూనిట్ ఇన్‌చార్జి కత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● గాంధీపురం పంచాయతీల్లో: గాంధీపురం పంచాయతీల్లో శ్రీనగర్‌కాలనీకి చెందిన పద్మావతి, లారెన్స్, సుమతి, మోహిత, ప్రియ, జ్యోతి, అనురాధ, జాను, సాయి, సంపూర్ణమ్మ, మునిలక్ష్మమ్మ, భావన, నీల, సుగుణ, జయంతి, జస్వంత్‌లు పులివర్తి నాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

● ఓటేరులో: ఓటేరు పంచాయతీకి చెందిన రమేష్, మోహన్, బాల, అజయ్‌లు పులివర్తి నాని తనయుడు వినీల్ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వినీల్ మాట్లాడుతూ.. అధికార వైసీపీ పాలనలో రౌడీయిజం, గంజాయి, కబ్జాలు, దాడులు, ఆక్రమణలు తప్ప మంచికి చోటులేదని విమర్శించారు. ప్రజలపక్షాన నిలబడే పులివర్తి నాని అభ్యర్థిత్వాన్ని బలపరచి మంచి మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

నవీన్‌కుమార్‌రెడ్డికి ఆరణి సన్మానం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 5: కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి శనివారం బీజేపీలో చేరిన నవీన్‌కుమార్ రెడ్డిని తిరుపతి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఇతర నాయకులతో కలిసి ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి గజమాలతో సన్మానించారు. నిత్యం ప్రజాసమస్యలపై పోరాడే నవీన్ బీజేపీలో చేరడం కూటమికి ఎంతో బలాన్ని ఇచ్చిందని ఆరణి పేర్కొన్నారు. నవీన్ మాట్లాడుతూ... ఆరణి ఎంతో సౌమ్యులని, తిరుపతి ప్రజలకు ఆయన సేవలు అవసరమని, ఆయన గెలుపు తథ్యమన్నారు. భువన్ కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, శివతేజ, దినేష్, రవిసుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు నవీన్‌ను కలిశారు.

నేటి నుంచి వేద విశ్వవిద్యాలయంలో వేసవి శిక్షణా తరగతులు

తిరుపతి రూరల్, మే 5: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వేసవి శిక్షణా తరగతులను సోమవారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు తరగతులు నిర్వహించనున్నారు. 16 సంవత్సరాల లోపువారికి వివిధ దేవతా సంబంధమైన ధ్యాన శ్లోకాలు, విష్ణు సహస్రనామ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం మొదలైనవి, 16 సంవత్సరాల పైబడినవారికి లలితా సహస్రనామ స్తోత్రం, వివిధ దేవతా స్తోత్రాలు, వ్రతాలు, నవవిధ భక్తి మార్గాలపట్ల అవగాహన, వేదాలకు సంబంధించి స్వశాఖపరమైన సంధ్యా వందనమును ఉపనయనమైనవారికి నేర్పించనున్నారు. మరింత సమాచారంకొరకు 95500 71629, 90008 50325 సెల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

అవినీతిపరుడైన జగన్‌కు మళ్లీ అధికారం ఇవ్వొద్దు

● తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాదరావు - బలిజ సంఘ నాయకులతో సమావేశమైన వరప్రసాదరావు

సూళ్లూరుపేట/వెంకటగిరి/శ్రీకాళహస్తి, మే 5: అవినీతి పరుడైన సీఎం జగన్ ప్రజాస్వామ్యంలో ఉండకూడదని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం జగన్ కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా చేశాడన్నారు. వ్యవస్థలు సర్వనాశనమై పోయాయని ఇవన్నీ చక్కబడి రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే సీఎంగా చంద్రబాబుని గెలిపించాలని కోరారు. పేదలకు పింఛన్ అందకుండా చేస్తున్న జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇవన్నీ చాలక ఇప్పుడు రైతుల పొలాలపై పడ్డాడని అటువంటి జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే నేటికీ కనబడుతోందే తప్ప గత ఐదేళ్లల్లో నయాపైసా పని జరగలేదని విమర్శించారు. టీడీపీ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, చిట్టేటి పేరుమాల్, బుద్ధి విజయలక్ష్మి, జనసేన నాయకుడు రమణ, వల్లూరు రాజా తదితరులు పాల్గొన్నారు.

కాపు సోదరులతో ఆత్మీయ సమావేశం...

వెంకటగిరిలోని ఎస్ఆర్‌గార్డెన్, శ్రీకాళహస్తిలోని మహేష్ కల్యాణ మండపాల్లో ఆదివారం బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వరప్రసాదరావు హాజరయ్యారు. జనసేన అధినేత పవన్ నిస్వార్థంగా రాజకీయాల్లోకి వచ్చారని, అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. తనకు చిరంజీవి కుటుంబంతో మొదటి నుంచీ మంచి సంబంధాలు ఉన్నాయని, అందుకే 2009లో తాను ప్రజారాజ్యంలో పని చేశానని గుర్తుచేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జనసేన నాయకుడు కోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీల ఆత్మీయ సభ


మాట్లాడుతున్న జగన్నాథం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5: తిరుపతి ప్రాంతంలోని బీసీ సంఘాల ఆత్మీయ సభ సోమవారం నిర్వహించనున్నట్టు బీసీ సాధికార కమిటీ సభ్యుడు జగన్నాథం తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలు - బీసీల అజెండాపై చర్చించడానికి సోమవారం ఉదయం 10 గంటలకు రామతులసి కల్యాణ మండపంలో సమావేశం కానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ప్రాంతంలోని అన్ని బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని కోరారు. టీడీపీ నేత కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. కూటమి గెలిస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, బీసీ సబ్ ప్లాన్, 50 ఏళ్లకే పెన్షన్ వంటి పథకాలు అమలవుతాయన్నారు. నాయకులు మధుసూదన యాదవ్, జ్ఞానశేఖర్, తులసీదాసు, రామారావు, బాలరాజు, గోపీయాదవ్, లోకేష్ పాల్గొన్నారు.

పెనుగాలుల సమయంలో జాగ్రత్తలు పాటించండి

తిరుపతి(ఆటోనగర్), మే 5: వేసవిలో అకాల వర్షాలు, పెనుగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని, ఆ సమయంలో విద్యుత్ వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్, రూరల్ డివిజన్ల ఈఈలు కె.వాసుదేవరెడ్డి, వాసురెడ్డి విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాల సమయంలో వినియోగదారులు ముందస్తుగా తమ నివాస గృహాల్లో వినియోగించే టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్‌లు, ఏసీలకు విద్యుత్ సరఫరాను ఆఫ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వేసవిలో విద్యుత్ వినియోగం సాధారణ కంటే గణనీయంగా పెరుగుతోందన్నారు. దీంతో విద్యుత్ నియంత్రికలు కాలిపోతున్నాయని వారు తెలిపారు. గత మూడు రోజుల క్రితం వీచిన పెనుగాలులకు సుమారు రూ.25 లక్షలు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. వినియోగదారులు జాగ్రత్తలు తప్పక పాటించాలని వారు కోరారు.

పెట్రోల్ బంకు వద్ద టాటా సుమోలో మంటలు

ఏర్పేడు, మే 5: ఏర్పేడు మండలం పల్లం పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఓ టాటా సుమోలో నుంచి ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. దీంతో పెట్రోల్ బంకు సిబ్బందితో పాటు పల్లం, గొల్లపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఒడిశాకు చెందిన కొంతమంది భక్తులు రెండు సుమోల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం బయలుదేరి వచ్చారు. పల్లం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఒక టాటా సుమో మరమ్మతులకు గురైంది. దీంతో ఆ వాహనాన్ని అక్కడే వదిలేసి మరో వాహనంలో తిరుమలకు వెళ్లారు. ఆదివారం ఉన్నట్లుండి టాటా సుమోలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజీపల్లెలో నారా గిరీష్ ప్రచారం / వైసీపీ పోటీ ప్రచారంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ


ఏజీ పల్లెలో టీడీపీ నాయకులతో నారా గిరీష్

చంద్రగిరి, మే 5: మండలంలోని అనంతగుర్రప్పగారి పల్లెలో ఆదివారం రాత్రి టీడీపీ తరపున మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు తనయుడు నారా గిరీష్ ప్రచారం నిర్వహించారు. స్థానిక వైసీపీ నాయకుడు మేడసాని ప్రవీణ్ కుమార్ కూడా పోటీగా వైసీపీ ప్రచారం నిర్వహించాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అనంతగుర్రప్పగారిపల్లెలో ఆదివారం టీడీపీ తరపున నారా గిరీష్ ప్రచారం నిర్వహిస్తారని ముందస్తుగా టీడీపీ నాయకులు గ్రామస్తులకు, వైసీపీ నాయకులకు తెలిపారు. సాయంత్రం గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు ఆధ్వర్యంలో ప్రచారాన్ని ప్రారంభించారు. గిరీష్ ఇంటింటికి వెళ్లి టీడీపీని గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తుండగా, మేడసాని ప్రవీణ్‌కుమార్ ఇతర గ్రామాల నుంచి కొంతమంది వైసీపీ కార్యకర్తలను తీసుకొచ్చి టీడీపీకి పోటీగా ప్రచారం మొదలుపెట్టారు. టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్ వద్దకు వెళ్లి ముందస్తుగా తమ ప్రచారం ఉందని తెలిపినా వైసీపీ ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ప్రవీణ్‌కుమార్ టీడీపీ నాయకులపై ఘర్షణకు దిగారు. గ్రామస్తులు ఇరువర్గాలకు సర్దిచెప్పారు. వైసీపీ ప్రచారాన్ని నిలిపివేయాలని గ్రామస్తులు కూడా కోరారు.

సమాచారం అందుకున్న సీఐ రామయ్య, పోలీసులు ఆగ్రామానికి చేరుకుని ఇరువర్గాలను విచారించారు. గ్రామాల్లో గొడవలు లేకుండా చేసుకోవాలని, లేదా అనుమతి తప్పని సరిగా తీసుకుని ప్రచారం హెచ్చరించారు. టీడీపీ నాయకులు తనపై దాడి చేశారని, వైసీపీ ప్రచార రథాన్ని ధ్వంసం చేసి, ఆటోడ్రైవర్‌పై దాడి చేశారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. దీంతో టీడీపీ నాయకులు వైసీపీ నాయకుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని, శనివారం నుంచి గ్రామంలో టీడీపీ ప్రచారం ఉందని ముందస్తుగా తెలియజేసినా వైసీపీ ప్రచారం నిర్వహించడం భావ్యం కాదన్నారు. టీడీపీ ప్రచారంలో తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, నాయకులు లోకాద్రి నాయుడు, ఎల్లప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

అరాచక పాలన పోవాలంటే ఎన్డీయే అభ్యర్థులను గెలిపించండి

23వ డివిజన్లో సుగుణమ్మ ప్రచారం



బాలాజీ కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సుగుణమ్మ

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శృతిమించిపోయిన అరాచకపాలన పోవాలంటే ఎన్డీయే బలపరిచిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావులను గెలిపించాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 23వ డివిజన్లోని బాలాజీ కాలనీలో ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థికి గాజుగ్లాసు (సీరియల్ నెంబరు 3)పై ఓటువేయాలన్నారు. టీడీపీ హయాంలోనే తిరుపతిలో అభివృద్ధి జరిగిందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో టీడీఆర్ బాండ్లలో వందల కోట్లను వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బుల్లెట్ రమణ, కోటేశ్వరరావు, ప్రేమ్ కుమార్ యాదవ్, రాజగోపాల్ రెడ్డి, మోహిత్, కుమార్, శ్రీనవాసులు, పెద్దసంఖ్యలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీయేతోనే తిరుపతి అభివృద్ధి సాధ్యం

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



కిరణ్‌రాయల్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న దుస్తుల వ్యాపారి

తిరుపతి అర్బన్, మే 5: ఎన్డీయేతోనే తిరుపతి అభివృద్ధి సాధ్యపడుతుందని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం ఆయన ఆదివారం మూడో డివిజన్‌లో పలు వీధుల్లో పర్యటించారు. వైసీపీ ప్రభుత్వంలో కరెంట్ బిల్లులు, నిత్యావసరాల ధరల పెంపుతో పాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పైనా ఓటర్లకు అవగాహన కల్పించారు. గుండాయిజం పోవాలంటే గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి ఆరణి శ్రీనివాసులును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తిరుపతిని గంజాయి నగరంగా మార్చారని, తద్వారా మంచి భవిష్యత్తున్న యువత బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంస్కృతి తిరుపతిలో మునుపెన్నడు చూడలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే తిరుపతిలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పి.. అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమకుమార్, నంద, హిమవంత్, జనసేన ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీయే జోరును ఆపలేరు

32వ డివిజన్లో పులుగోరు మురళి ప్రచారం



32వ డివిజన్లో ప్రచారం చేస్తున్న పులుగోరు మరళీకృష్ణా రెడ్డి

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): 'ఉద్యోగుల తొలిరోజు పోస్టల్ బ్యాలెట్లోనే పోలింగ్ సరళి ఎన్డీయేకు అనుకూలంగా ఉందని తేలిపోయింది. తిరుపతిలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు విజయాన్ని ఆపలేరు' అని టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 32వ డివిజన్‌లోని యాదవ వీధి, తీర్థకట్టవీధి, నిమ్మకాయల వీధిలో ప్రచారం చేశారు. గాజుగ్లాస్, కమలం గుర్తులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు యాదవ్, ఆనంద్ యాదవ్, లోకేష్, ఎస్కేడీ నగర్ విజయ్, జగదీష్, శంకర, నిమ్మకాయ వీధి సాయి, గిరి, మోహన్, సూర్యనారాయణ రెడ్డి, రేవతి, కల, కుమారి పాల్గొన్నారు.

స్కూటర్‌పై తిరిగిన భూమనకు కోట్లు ఎలా వచ్చాయి?

- భూదందాలు, కమీషన్లతో తిరుపతి ప్రతిష్ట దిగజార్చారు
- దొంగ ఓట్లపై దర్యాప్తు సరిగా జరిగివుంటే పోటీకి అభినయ్ అనర్హుడయ్యేవాడు
- బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి

ఫటాఫట్!

టీటీడీలో ఎవరు ఏ నియమం తప్పినా, ఎక్కడ ఏ నిబంధన ఉల్లంఘనకు గురైనా తొట్టతొలుత స్పందించే స్వరమది! ధార్మిక సంస్థలో ఈ దురాగతాలేమిటంటూ నిలదీసే గొంతుక అది! ప్రశ్నించడంతో సరిపెట్టుకోక ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి దేవస్థానంలో అధికారులు చేసిన తప్పిదాలను సరిదిద్దేందుకు పోరాడే ఆ గొంతుకే బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి. సార్వత్రిక ఎన్నికల వేళ తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాల మీద భానుప్రకాశ్‌రెడ్డితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..



? ఈ ఎన్నికల్లో అభివృద్ధే అజెండా అని మీ ప్రత్యర్థులు అంటున్నారు.

! డొక్కు డబుల్ డెక్కర్ బస్సు కోసం తిరుపతిలో అభినయ్ వేల చెట్లు నరికించి వేశారు. ఇదేనా అభివృద్ధి? టీడీఆర్ బాండ్ల పేరిట దోచుకోవడం అభివృద్ధా? కమీషన్లతో కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేయడం అభివృద్ధా? చివరికి దేవుడి దర్శనం టికెట్లు కూడా దళారీలను పెట్టుకుని అమ్ముకోవడం అభివృద్ధా? తులసి వనం లాంటి తిరుపతిని గంజాయి వనం చేయడం అభివృద్ధా? టీటీడీ నిధులను దారి మళ్లించడం అభివృద్ధి అవుతుందా? గతంలో స్కూటరుపై తిరిగిన ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి ఇన్ని రూ.కోట్ల ఆస్తి ఎలా వచ్చింది? ఏం వ్యాపారాలు, ఉద్యోగాలు చేసి ఇంత భారీగా ఆస్తి సంపాదించారు? నిజాయితీపరుడైతే తిరుపతిలో భూ దందాలపై, కమీషన్ల వసూళ్లపై, టీడీఆర్ బాండ్లపై జ్యుడిషియల్ ఎంక్వైరీకి సిద్ధమా? తిరుపతి నగర ప్రతిష్టను దిగజార్చిన అభినయ్‌రెడ్డికి, ఎమ్మెల్యే కరుణాకర రెడ్డికి తిరుపతి ప్రజలను ఓట్లు అడిగే నైతిక అర్హత లేదు.

? తిరుపతి ప్రజలను మీరు ఏమి కోరుతున్నారు.

! కమీషన్ల ఎమ్మెల్యే కావాలా లేక అభివృద్ధి, సంక్షేమాల కోసం శ్రమించే ఎమ్మెల్యే కావాలా అన్నది ఈ ఎన్నికల్లో తిరుపతి ప్రజలే నిర్ణయించుకోవాలి. ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపిస్తే తిరుపతి అభివృద్ధి దిశగా కొత్త దశ మొదలవుతుంది. ప్రధాని మోదీ వారణాసి తరహాలో తిరుపతిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద తిరుపతి అభివృద్ధికి రూ.2,500 కోట్లు ఇచ్చింది మోదీ ప్రభుత్వమే. తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయి కల్పించడం, తిరుపతి రైల్వేస్టేషన్‌ను వరల్డ్ క్లాస్ స్టేషన్‌గా మార్చడం.. మోదీ వల్లే సాధ్యం అవుతున్నాయని తిరుపతి ప్రజలకు తెలుసు. అభివృద్ధి ఇదే తీరుగా కొనసాగాలంటే ఎన్డీయే అభ్యర్థిని గెలిపించాలనే ఆకాంక్ష తిరుపతి ప్రజల్లో బలంగా ఉంది.

? ప్రత్యర్థులను ఎలా ఎదుర్కొంటారు?

! ఈ ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన అవినీతి, అక్రమాలు, గూండాగిరీ, టీటీడీ నిధుల మళ్లింపు, అక్రమార్జన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. ఎమ్మెల్యే అంటే పదిమందికి ఆదర్శంగా వుండాలి తప్ప ఆదాయం కోసం అడ్డదారులు తొక్కే వ్యక్తిగా వుండకూడదు. ఇలాంటి వ్యక్తులతో తిరుపతిలో ప్రజాస్వామ్యం నిలబడుతుందా? ప్రజలే ఆలోచించాలి.

? 34 వేల దొంగ ఓట్ల వ్యవహారంలో దర్యాప్తు తీరు ఎలా ఉంది.

! నకిలీ ఓటరు కార్డుల వ్యవహారంలో సరైన విధంగా దర్యాప్తు జరిగివుంటే ఇప్పటికే అభినయ్‌రెడ్డి పోటీకి అనర్హుడని ఈసీ ప్రకటించి వుండేది. 34 వేల దొంగ ఓటరు కార్డుల తయారీ వ్యవహారంలో స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ అంతా ఎమ్మెల్యే భూమనది కాదా? అతడికి సహకరించిన అధికారులు బలయ్యారు. రాబోయే రోజుల్లో దీనిపై లోతుగా దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటే ఎమ్మెల్యే పరిస్థితి ఏమవుతుంది?

? టీటీడీ చైర్మన్, ఈవోలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు కదా.

! రూ.1,500 కోట్ల టీటీడీ ఇంజనీరింగ్ పనులను కమీషన్ల కోసం ఆమోదించారు. టీటీడీ చైర్మన్ హోదాలో వుంటూ భూమన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. టీటీడీ ఉద్యోగులు, కొండపై వ్యాపారులను ప్రభావితం చేస్తున్నారు. టీటీడీని అడ్డుపెట్టుకుని ఎన్నికల ఖర్చుకు కొండపై వ్యాపారుల నుంచీ రూ.కోట్లు వసూళ్లు చేస్తున్నారని భక్తులు కూడా ఫిర్యాదు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ దీనిపై చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నా.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు

తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.2.95 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 77,848 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 39,317 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

జగన్ ఓటమి ఖాయం: చింతా మోహన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5: ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయమని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను మత్తు ప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. తిరుపతిలో రౌడీ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. వైసీపీకి 30 ఎమ్మెల్యే స్థానాలు మించి రావని జోస్యం చెప్పారు. రాజకీయ మనుగడ కోసమే బీజేపీ కుల, మత విద్వేషాలు రేపుతోందని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని చింతామోహన్ కోరారు. ఈ సమావేశంలో గోపిగౌడ్, శాంతియాదవ్, తేజోవతి, ముని, శోభ, వెంకటేష్‌గౌడ్, భాస్కర్, చిరంజీవి పాల్గొన్నారు.

దివ్యాంగులను మోసం చేసిన వైసీపీ : స్వతంత్ర అభ్యర్థి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5: దివ్యాంగులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని తిరుపతి అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి మాధవన్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో ప్రతి దివ్యాంగుడికీ ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చిన భూమన అభినయ్‌రెడ్డి ఆ ఊసే మరిచిపోయారని తెలిపారు. దివ్యాంగుల సంఘం నాయకులు పెంచలయ్య, రెడ్డెయ్య, చంద్రశేఖర్, వెంకటేష్, గాంధీ పాల్గొన్నారు.

జనసేనలోకి ముస్లిం నేత



ఆరణితో షేక్ మౌలానా

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ నేత షేక్ మౌలానా తన అనుచరులతో కలసి ఆదివారం జనసేనలో చేరారు. గతంలో ఇతను మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ తరఫున నామినేషన్ వేశారు. తనకుమారుడిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని బెదిరించి.. పోటీకి దూరం చేశారని మౌలా ఈసందర్భంగా వాపోయారు. ఇక భయపడేదిలేదని.. భూమన అభినయ్ రెడ్డి ఓటమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మౌలాతోపాటు హరికిషన్, పాలు రమేష్, రవి, బెల్లంకొండ ఖాదర్ బాష, బన్నీ, జిలాని, కువైట్ నాగరాజు, షబ్బీర్ తదితరులున్నారు.

ముస్లిం, బీసీలకు తోడుగా ఉంటా

ఎన్డీయేతోనే సర్వతోముఖాభివృద్ధి - జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



ఆరణి శ్రీనివాసులును సన్మానిస్తున్న బీసీ, వడ్డెర నేతలు

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): 'ముస్లిం మైనారిటీలు, బీసీ, వడ్డెరలకు తోడుగా ఉంటా. ఏ కష్టమొచ్చినా నా ఇంటి తలుపు తెరిచే ఉంటుంది' అని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఓ కల్యాణ మండపంలో ముస్లిం మైనారిటీ నాయకులు, వడ్డెర సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. గతంలో బీజేపీ, జనసేన పొత్తులో ఉన్న టీడీపీ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు అన్నిరకాల సంక్షేమ పథకాలు, వారి రక్షణకు కృషిచేసిందన్నారు. ఇప్పుడు కూడా అంతకుమించి సంక్షేమ ప్రణాళికలు ఎన్డీయే కూటమి దగ్గర ఉన్నాయన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తున్నామని, వడ్డెర కులస్తులు తన కుటుంబసభ్యులని చెప్పారు. ఈకార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన పరిశీలకుడు ఏఎం రత్నం, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మోహన్, రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొన్నారు. ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆరణి జగన్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, దంపూరి భాస్కర్, మహబూబ్ బాషా, రఫీ హిందూస్థానీ, షేక్ సలీం, షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



ఆరణి జగన్‌తో ముస్లిం నేతలు

భూమన కుటుంబానికి బీటలు

- వైసీపీని వీడిన నలుగురు మహిళా కార్పొరేటర్లు
- ఇద్దరు టీడీపీ, ఇద్దరు జనసేనలో చేరిక
- జనసేన కండువా కప్పుకున్న వైసీపీ డివిజన్ అధ్యక్షులు
- కరుణ వెంటవున్న దొడ్డారెడ్డి కుటుంబం రెండ్రోజుల ముందే చేరిక
- పవన్ సమక్షంలో మరికొంతమంది కార్పొరేటర్లు, ముఖ్యనేతలు చేరే అవకాశం



జనసేనలో చేరిన కార్పొరేటర్లతో ఎన్డీయే కూటమి నేతలు

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): 'భూమన' కుటుంబానికి బీటలు వారాయి. వైసీపీ కార్పొరేటర్లు, ముఖ్యనేతలంతా సమావేశమై తామంతా భూమన కుటుంబ సభ్యులమని చెప్పి 24 గంటలు గడవకముందే ఇద్దరు మహిళా కార్పొరేటర్లు ఝలక్ ఇచ్చారు. ఆదివారం ఉదయం ఓ హోటల్లో ఎన్డీయే కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సమక్షంలో 31వ డివిజన్ కార్పొరేటర్ సీకే రేవతి, 30వ డివిజన్ కార్పొరేటర్ కల్పనలు వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. అలాగే ఆయా డివిజన్ అధ్యక్షులు సీకే రవి, యాదవకృష్ణ, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు కూడా తమ అనుచరులతో కలసి జనసేన కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. 'భూమన వల్లే వైసీపీని వీడుతున్నారు. టీడీఆర్ బాండ్లకోసం రోడ్లు వేసుకున్నారు. వర్షాకాలంలో తిరుపతి రోడ్లు మీద నడవాలంటే కష్టంగా ఉంటుంది. మున్సిపల్ స్కూల్స్‌ని కూడా పట్టించుకోలేదు. యాదవ్, బలిజలను ఉద్ధరించామని చెప్పారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులిచ్చి అవమానించారని అందరికీ తెలుసు. వారికి జరిగినంత అవమానం మరెవ్వరికీ జరగలేదు. తండ్రీ కొడుకులు చేసిన తప్పులే ఎన్డీయేలోకి చేరేలా చేస్తోంది' అని చెప్పారు. కార్పొరేటర్ అన్నా సంధ్య మాట్లాడుతూ.. 'ముందు ముందు ఇంకా వలస వచ్చే పరిస్థితి ఉంది. ఇక భూమన కుటుంబం రాజకీయాలు చేసే పరిస్థితి లేదు. వాళ్లను ఎక్కడ పెట్టాలో అక్కడ జనం పెడతారు.' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, నేతలు పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, పొలకల మల్లికార్జున్, పాతకం వెంకటేష్, కూరపాటి సురేష్, నైనార్ శ్రీనివాసులు, బండ్ల లక్ష్మీపతి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఇది వరకే టీడీపీలో చేరిన అన్నా సిస్టర్స్

ఇదివరకే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వైసీపీ కార్పొరేటర్లు అన్నా సిస్టర్స్ సంధ్య, అనితలు ఆపార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. పెద్దకాపులే అవుట్‌లో రెండ్రోజులకు ముందు భూమన కుటుంబానికి అండగా ఉన్నామని చెప్పుకునే దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డితోపాటు పలువురు దొడ్డారెడ్డి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున టీడీపీలోకి వచ్చేశారు. ఏడో తేదీన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తిరుపతి పర్యటన సందర్భంగా వైసీపీ కార్పొరేటర్లు, నేతలు, రెవెన్యూ ఉద్యోగ సంఘ మాజీ నాయకులు పెద్దఎత్తున కూటమిలో చేరే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఎన్డీయే కూటమిలోకి ప్రతిరోజూ పెద్దఎత్తున వైసీపీ శ్రేణుల వలసలు పెరిగి పోతుండటంపై భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ రెడ్డిలు అయోమయంలో పడ్డారు. వైసీపీ కార్పొరేటర్లు ఎన్డీయేలోకి వెళ్లిపోతున్నారన్న ప్రచారం నేపథ్యంలో మీడియా ముందు బలపరీక్ష పెట్టినప్పటికీ అది బలవంతపు పరీక్షేనని తేలిపోయింది. మరో రెండు, మూడ్రోజుల్లో వైసీపీ ఖాళీ కాబోతుందని జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రకటించడంతో భూమన బ్యాచ్‌లో గుబులు పట్టుకుంది.

మమ్మల్ని ప్రజల్లో తిరగనివ్వలేదు



వైసీపీలో మాకు సముచిత స్థానం ఇవ్వలేదు. ప్రజల మనసు గెలిచి ఎన్నికైన మేము ప్రజల్లో తిరిగితే ఒప్పుకునేవారు కాదు. మమ్మల్ని ఇంటికే పరిమితం చేశారు. కనీస గౌరవం, గుర్తింపు కూడా లేదు. అందుకే వైసీపీ వీడి జనసేనలోకి చేరాం.

- రేవతి, కల్పన, వైసీపీని వీడిన కార్పొరేటర్లు

భూమన చెరనుంచి బయటపడాలని చూస్తున్నారు

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం తథ్యంగా కనిపిస్తోంది. భూమన చెర నుంచి బయటపడాలని అక్కడి నేతలు ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకోబోతున్నారు. వైసీపీని వీడి కుటుంబాలు, కుటుంబాలే కూటమిలోకి చేరిపోతున్నాయి. మహిళా కార్పొరేటర్లు స్వేచ్ఛ కావాలని స్వచ్ఛందంగా వచ్చి కూటమిలో చేరుతున్నారు. తండ్రీ, తనయుల వైఫల్యాలకు ఇవే నిదర్శనం.

- సుగుణమ్మ, టీడీపీ మాజీ ఎమ్మెల్యే

అబ్బా కొడుకు తప్ప ఇంకెవరూ మిగలరు

వైసీపీని వీడి ఎన్డీయేలోకి వలసలు పెరగడం శుభపరిణామం. కూటమి అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచే భూమన తండ్రీ, తనయుల ఆటలకు అంతం మొదలైంది. ప్రతిరోజూ వైసీపీ నుంచి రాజీనామాలు చేసి టీడీపీ, జనసేనలోకి చేరుతున్నారు. అబ్బా, కొడుకుల అహంకార దోరణిని తట్టుకోలేకే బయటకు వస్తున్నారు. ఈ ఐదేళ్లలో వారు తప్ప తక్కినవారిని ఎదగనీయకుండా చేశారు. పదవులు, అవినీతి సొమ్మును వెనకేసుకుంటూ వచ్చారు. వైసీపీలో అబ్బా కొడుకు తప్ప ఇంకెవరూ మిగలరు. మరో రెండు, మూడ్రోజుల్లో అదే జరిగి తీరుతుంది. వారివల్ల నష్టపోయినవారిని ఆదుకునే బాధ్యత ఎన్డీయే తీసుకుంటుంది.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి

అభివృద్ధి చేయమంటే పట్టించుకోలేదు

మానాన్న బక్కయ్య నెహ్రూనగర్ వ్యవస్థాపకుడు. మాకు 70 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉంది. మా చిన్నాన మున్సిపల్ చైర్మన్‌గా పోటీచేశారు. నా భార్య కల్పన వైసీపీ కార్పొరేటర్. మా డివిజన్లో సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి చేయమని వైసీపీ పెద్దలను కోరితే పట్టించుకోలేదు. ప్రధానంగా అలిపిరి నుంచి రామచంద్ర పుష్కరిణి వరకు పెద్ద డ్రైన్ కాలువ సమస్యపై ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకపోయింది. ఎన్డీయే ప్రభుత్వంలో మా డివిజన్‌కి న్యాయం జరుగుతుందని భావించి వైసీపీని వీడి జనసేనలో చేరాం.

- యాదవకృష్ణ, 30వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు

దళితులను దగా చేస్తున్నారు


టీడీపీ ప్రభుత్వంలో దళితులకు ఎన్నో మేళ్లు జరిగాయి. ఎస్సీ కార్పొరేషన్ కింద తిరుపతిలో 30కిపైగా ఇన్నోవా వాహనాలను దళితులు తీసుకుని ఉపాధి పొందారు. నేనుండే చెన్నారెడ్డి కాలనీలోనే ఎనిమిది మంది వాహనాలను సబ్సిడీ కింద తీసుకుని లబ్ధిపొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్క వాహనం కూడా ఇవ్వలేదు. అందుకే మా దళిత బంధు, మిత్రుల సూచనలతో వైసీపీని వీడి.. జనసేనలో చేరా.

- వెంకటేశ్వర్లు 39వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు

బీసీలు అక్కడ ఉండలేక పోతున్నారు

బీసీ కులాలకు చెందిన అన్నాసిస్టర్స్‌తో పాటు రేవతి, కల్పనలు టీడీపీలో చేరారంటే అక్కడ ఏవిధంగా ఇబ్బంది పెడుతున్నారో అర్థం అవుతోంది. నాలుగు రోడ్లు వేసి టీడీఆర్ బాండ్లతో ఖజానా నింపుకోవడం కాదని, నిర్మాణాత్మక అభివృద్ధి అంటే ఏంటో టీడీపీ మాత్రమే తిరుపతిలో చేయగలిగింది. భూమన కుటుంబం అభివృద్ధి తప్ప.. నగర అభివృద్ధి జరగలేదని ఎవర్ని అడిగినా చెబుతారు.

- నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు



మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

తిరుపతి - ఆంధ్రజ్యోతి

తొలిసారి గెలిచినపుడు ఎలా ఉండేవాడు.. రెండోసారి విజయం తర్వాత ఎలా మారిపోయాడు.. అనే మాటలు సూళ్లూరుపేట నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురించి వినబడుతూ ఉంటాయి. అప్పటి అమాయకత్వం, మృదుభాషణ, సౌమ్యత, వినమ్రత.. ఇవన్నీ ఏమయ్యాయి అని అందరూ ఆశ్చర్యపోతుంటారు. ఆయనలోని ఈ మార్పును తొలిగా ప్రశ్నించింది సొంతపార్టీవారే కావడం విశేషం. మాట చెప్పి మడమ తిప్పే తమ నాయకుడు జగన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న కిలివేటి సంజీవయ్య సూళ్లూరుపేట నియోజకవర్గంలోనూ అదే పాటించారు. అభివృద్ధి ఇసుమంతైనా చేయకపోగా అవినీతి ఆరోపణలను లెక్కకుమిక్కిలిగా మూటగట్టుకున్నారు. సొంతపార్టీలోనే కట్టుదప్పిన శాంతిభద్రతలను దారిలో పెట్టలేక నిస్సహాయంగా చూస్తూవుండిపోయిన ఆయన సరిహద్దు నియోజకవర్గం అయిన సూళ్లూరుపేట భద్రతకు ఏమి భరోసా ఇస్తారని జనం అంటున్నారు. మూడోసారీ తనకే ఓటేయండని ఏ మొహం పెట్టుకుని అడుగుతారని ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు.



కొందరికే ప్రాధాన్యం

సంజీవయ్య రెండవ సారి గెలిచాక అక్రమార్జన గురించి తప్ప మరేమీ పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టారని, తన అక్రమార్జనకు సహకరించే కొందరిని మాత్రమే దగ్గరగా పెట్టుకున్నారని నియోజకవర్గం హోరుమంటోంది.

హామీలు మరచి.. అవినీతి పెరిగి..

మనిషే మారెనూ..

మత్స్యకారులపై నోరు జారారు

గతేడాది జూన్‌లో తడ మండలానికి చెందిన మత్స్యకారులు తమ సమస్యలు చెప్పుకుందామని తన నివాసానికి రాగా వారిని కుక్కల్లాగా మీద పడుతున్నారంటూ దూషించారు. బయటకు వెళ్లమని గదమాయించారు. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు ఎమ్మెల్యే నివాసం ఎదుట ధర్నాకు దిగారు. ఎన్నికల్లో ఓట్ల కోసం తమ గ్రామానికి ఎలా వస్తావో చూస్తామని హెచ్చరించి వెళ్లారు.

నెల్లూరులో నివాసం.. అవస్థల్లో జనం

నాయుడుపేటలో సొంత ఇల్లు, ఇతర ఆస్తులు వున్నప్పటికీ ఎమ్మెల్యే తొలినుంచీ నెల్లూరులోనే నివాసముంటున్నారు. పనులున్న జనం, కార్యకర్తలు, ఆయన్ను వెతుక్కుంటూ నెల్లూరు వెళ్లాల్సి వస్తోంది. ఎమ్మెల్యే కోసం నెల్లూరు వెళ్లాలంటే తడ నుంచీ 92 కిలోమీటర్లు, సూళ్ళూరుపేట నుంచీ 80 కిలోమీటర్లు, దొరవారి సత్రం, పెళ్ళకూరు మండలాల నుంచీ 77, నాయుడుపేట నుంచీ 65 కిలోమీటర్లు, ఓజిలి నుంచీ 53 కిలోమీటర్లు చొప్పున ప్రయాణించాలి. తిరుగు ప్రయాణంతో కలిపి చూస్తే తడ వాసులు 200 కిలోమీటర్లు, మిగిలిన మండలాల వాళ్ళు 110 నుంచీ 160 కిలోమీటర్లు ప్రయణించాలి. బస్సు ఛార్జీలు తడిసి మోపెడవుతాయి.



పేట ప్రజల చెవిలో సంజీవయ్య పూలు

గత ఎన్నికల ప్రచారంలో కిలివేటి సంజీవయ్య నియోజకవర్గ ప్రజలకు ఎన్నో హామీలిచ్చారు. అవి నెరవేర్చకుండానే మళ్లీ ఓటెయ్యమంటూ అడుగుతున్నారు. ఆయన ఇచ్చిన హామీల్లో కొన్ని...

హామీ: నెర్రికాలువ ఆధునికీకరణ

అమలు తీరు: దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, తడ మండలాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందించే నెర్రి కాలువ ఆధునికీకరణకు రూ. 27 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం జరగలేదు.

హామీ: నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం.

అమలు తీరు: నాయుడుపేట, సూళ్ళూరుపేటల్లో గత టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసి నిర్మాణంలోవున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల పనులు ఈ ప్రభుత్వంలో పూర్తిగా ఆగిపోయాయి. నిర్మాణ స్థలాల్లోని సామగ్రిని కూడా కాంట్రాక్టర్లు తరలించేశారు. వేసవి వచ్చిందంటే ఈ రెండు పట్టణాల్లోనూ బిందె పది రూపాయలు పెట్టి కొనుక్కోవాల్సిన దుస్థితి.

హామీ: పులికాట్‌లో పూడికతీత

అమలు తీరు: ప్రకటనలకే పరిమితం. ఎలాంటి ముందడుగూ పడలేదు.

హామీ: కాళంగి గ్రాయిన్ నిర్మాణం

అమలు తీరు: ఐదు సార్లు టెండర్లు పిలిచినా ప్రభుత్వం నుంచీ బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. పనులు కదల్లేదు. ఎమ్మెల్యే చేతులెత్తేశారు.

హామీ: ఏడాదిలో వేనాడు-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణం

అమలు తీరు: ఆ ఊసే లేదు.

హామీ: విన్నమాల పంట కాలువ పూడిక తీత, ఆధునికీకరణ

అమలు తీరు: నివేదికలకే పరిమితం.

హామీ: ఆరు నెలల్లో మీజూరు వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం

అమలు తీరు: అతీగతీ లేదు.

సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తీరుపై భగ్గుమంటున్న జనం

అవినీతి సామ్రాట్

ఐదేళ్లూ అభివృద్ధి ఊసు లేకపోయినా అవినీతి, అక్రమార్జనల ఆరోపణల వెల్లువలో కిలివేటి నిలువునా తడిసి ముద్దయ్యారు. రాజకీయ ప్రత్యర్థులు చేసే ఆరోపణలైతే కొట్టిపారేయొచ్చు. కానీ సొంత పార్టీ నాయకులే బహిరంగ సమావేశాలు పెట్టి మరీ ఎమ్మెల్యే అవినీతి చిట్టా విప్పి చెప్పడం విశేషం. ఆయనను అడ్డుపెట్టుకుని కొందరు సన్నిహిత అనుచరులు, నాయకులు కూడా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలూ వున్నాయి. ఆరోపణల్లో మచ్చుకు కొన్ని...

- గ్రావెల్, ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి వంటి వాటి అక్రమ దందాలతో సంబంధం వుందని సొంత పార్టీ నేతలే ఆరోపించారు. ఈ దందాలతో ఎమ్మెల్యే, ఆయన అనుకూల వర్గ నేతలు రూ. కోట్లు వెనకేసుకున్నారన్న ప్రచారం నడుస్తోంది.
- సెటిల్‌మెంట్లకు దిగి వాటాలు అందుకోవడం, మాట వినని వారిని బెదిరించడం చేశారన్న ఆరోపణలున్నాయి.
- స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో నామినేషన్ ఉపసంహరించుకోవాలని సూళ్ళూరుపేటలో టీడీపీకి చెందిన బీసీ నాయకుడు వెంకటసుబ్బయ్యను బెదిరించారనే ఆరోపణలున్నాయి.
- సూళ్ళూరుపేటలోని ఓ ప్రైవేటు హోటల్ స్థల వివాదంలోనూ తలదూర్చి భారీ మొత్తం వసూలు చేశారనే ప్రచారం జరిగింది.
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ళ సముదాయం వద్ద భారీ ఇసుక నిల్వలను కరిగించి రూ.2 కోట్లకు విక్రయించారని, అక్కడున్న స్టీలు, సిమెంట్ కూడా మాయం చేశారనే ఆరోపణలున్నాయి.
- పెళ్ళకూరు మండలం శిరసనంబేడు కొండలో అనుచరుల ద్వారా గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగించారని, జాతీయ రహదారి కాంట్రాక్టరు సహకారంతో రూ. కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి.
- స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలించి భారీగా వెనకేసుకున్నారనే ప్రచారముంది.
- ఇరిగేషన్ శాఖలో రూ. 70 కోట్ల వరకూ పనులు తీసుకుని కాంట్రాక్టర్ల నుంచీ భారీగా కమీషన్లు వసూలు చేశారని, పెద్దగా లాభాలు వుండవని ఆ పనులు ఆపేసినట్లు ప్రచారం జరుగుతోంది.
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల స్థలాల చదును పేరిట రూ. 4 కోట్లు బిల్లులు చేసుకున్నారని, వాస్తవంగా అందులో 30 శాతం కూడా ఖర్చు చేయలేదన్న ఆరోపణలున్నాయి.
- కొవిడ్ సమయంలో నాయుడుపేట సెజ్ పరిశ్రమల నుంచీ సుమారు రూ. 4 కోట్లు వసూలు చేశారని, అందులో పావు వంతు కూడా ప్రజలకు ఖర్చు చేయలేదన్న ఆరోపణలున్నాయి.
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి అప్రూవల్స్‌ను అడ్డుకుని వారి నుంచీ రూ. కోట్లు వసూలు చేశారని ఆరోపణలు వున్నాయి.
- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా చివరికి సొంత పార్టీ వారైనా కూడా పోలీసులతో బెదిరించడం, కొట్టించడం వంటివి చేశారనే ఆరోపణలున్నాయి.
- ఎమ్మెల్యే వర్గంలో ప్రధాన నాయకుడైన డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని వ్యతిరేకించిన వైసీపీ నాయకుడు రాకేష్‌రెడ్డిని స్థంభానికి కట్టేసి కొట్టించారనే ఆరోపణను ఎదుర్కొంటున్నారు.

ఇదీ సంగతి



నేతల దర్శనానికి 'బ్రేక్'

తిరుమల కొండపై శ్రీవేంకటేశ్వరస్వామి వీఐపీ బ్రేక్ దర్శనమంటే గుర్తుకొచ్చేది రాజకీయ నాయకులే. మంత్రులో, ఎమ్మెల్యేలో, ఇతర పదవుల్లో కొలువుదీరేవారో సుప్రభాత వేళ సకుటుంబ పరివారంగా స్వామి దర్శనానికి బారులు తీరేవారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక రాజకీయ నాయకుల తాకిడి తగ్గిపోయింది. వీరంతా ఎవరికి వారు నియోజకవర్గ రాజకీయాలతో బిజీ అయిపోయారు. నియోజకవర్గం కదిలివేళ్లేందుకు ఎవరూ సాహసించడంలేదు. ఈలోగా ఏ పరిణామం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఈనేపథ్యంలోనే మార్చి నుంచే తిరుమలకు వీఐపీ నాయకుల రాక తగ్గుముఖం పట్టింది. ఏప్రిల్ రెండోవారం నుంచి వీరకనిపించకుండా పోయారు. దీంతో వీఐపీ బ్రేక్ సమయాన్ని టీటీడీ అధికారులు తగ్గించారు. సామాన్య భక్తులంతా రెండుమూడు గంటల్లోనే స్వామిని దర్శించుకుంటున్నారు. వీఐపీ గదులు కూడా ఇప్పుడు దర్శన టికెట్ ఉంటే చాలు సులభంగా దొరుకుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రచారానికి సన్‌స్ట్రోక్



మాయదారి ఎన్నికలు మాంచి ఎండల్లో వచ్చాయి. ప్రచారం మహా కష్టంగా ఉందంటూ తెగబాధ పడిపోతున్నారు పార్టీల అభ్యర్థులు. గెలవాలి కాబట్టి మేమైతే కష్టమో నష్టమో తిరుగుతాం.. వెంటొచ్చే కార్యకర్తల,జనాల మాటేంటంటూ టెన్షన్ పడిపోతున్నారు. సమయం చూస్తే దగ్గరకొచ్చేస్తోందంటూ హైరానా పడుతున్నారు. విపరీతంగా కాస్తున్న ఎండలకు భయపడి ప్రచారానికి కార్యకర్తలు ముందుకురావడం లేదు. వచ్చినా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మాత్రమే ఉంటామంటున్నారు. మిట్టమధ్యాహ్నం తిరగడం మావల్ల కాదని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. దీంతో ఏం చేయాలో నాయకులకు పాలుపోవడం లేదు. ఉదయం, సాయంత్రం ప్రచారానికి వస్తున్న వారికి రెండు విడతలుగా రూ. 200 వంతున ఇవ్వాల్సి వస్తుందని నాయకులు లెక్కలేసుకుని తలపట్టుకుంటున్నారు. డబ్బులు కాకుండా మంచినీళ్ల, మజ్జిగ ప్యాకెట్లూ షరామామూలే. వాస్తవంగా ఇప్పటికే బూత్‌కు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు పంపిణీ చేశారు. రెండు పూటలు డబ్బులివ్వాలనే కొత్త డిమాండ్ రావడంతో ఖర్చు తడిసిమోపెడవుతోందని పార్టీ నాయకులు గొణుక్కుంటున్నారు. - తడ

జగన్ డోర్ డెలివర్రీ

- ఇంటికే రేషన్ సరుకులంటూ నాడు హామీ
- వీధిలో వాహనం దగ్గర ప్రజలకు తప్పని తిప్పలు



ఇంటికే డెలివరీ అంటూ జగన్ ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో అపహాస్యం పాలైంది. అంతేకాదు రేషన్ సరుకుల్లోనూ కోతలు విధించి జనానికి నరకం చూపిస్తోంది. 2019 మ్యానిఫెస్టోలో రేషన్ సరుకులు నేరుగా ఇంటికే అందజేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా 2021 ఫిబ్రవరి నుంచి సీఎం జగన్ రేషన్ వాహనాలను ప్రారంభించారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున ఇందుకోసం భారీగా హడావిడి చేశారు. పది వేల రేషన్ వాహనాలను వరసగా పెట్టి మరీ ఆర్భాటం చేశారు. ఇంటికే సరుకులు వచ్చేస్తాయని సంబరపడిపోయిన జనం అసలు విధానాన్ని చూసి నీరసపడ్డారు. రేషన్ కేంద్రాల ముందుండే జనాలు ఇప్పుడు రేషన్ వాహనాల ముందు క్యూ కడుతున్నారు. డోర్ డెలివరీ చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం వీధిలో వాహనాన్ని నిలుపుతోంది. వీధిలో వారంతా అక్కడికే వచ్చి తీసుకోవాలని నిబంధన పెట్టింది.

● మోసం గురూ

ఇంటికి తీసుకువచ్చి ఇవ్వకుండా ఇలా వీధి చివర ఎండలో వాహనం ముందు నిలబెట్టడం కన్నా పాత పద్ధతిలో దుకాణాల్లోనే ఇవ్వచ్చు కాదా అంటూ విమర్శిస్తున్నారు. పైగా రేషన్ వాహనం రావడానికి ఓ టైం షెడ్యూలు ఉండదు. వచ్చినప్పుడే తీసుకోవాలి. ఒక వేళ పనుల్లోపడి వాహనం వద్దకు వెళ్లలేపోతే ఆ నెల రేషన్ ఉండదు. ఈ కొత్త రేషన్ పద్ధతిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

ప్రతినెలా సరుకుల్లో కోత

హామీల్లోనే కాదు..రేషన్ సరుకుల్లోనూ వైసీపీ ప్రభుత్వం కోతలతో ప్రజలను మోసగిస్తోంది. సాధారణంగా రేషన్ సరుకుల్లో బియ్యంతో పాటు చక్కెర, గోధుమపిండి, కందిపప్పు, రాగిపిండి ఇవ్వాలి. కానీ ఈ ఐదు సరుకులు సంపూర్ణంగా ఇచ్చిన దాఖలాలు ఈ ప్రభుత్వంలో లేనే లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. కేవలం బియ్యం, చక్కెరతోనే సరిపెడుతున్నారు. జిల్లాలో 6,03,000 మంది లబ్ధిదారులున్నారు. 369 వాహనాల ద్వారా వీరికి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి. ప్రతినెలా 8,350 టన్నుల బియ్యం, 286 టన్నుల చక్కెర, 180 టన్నుల కందిపప్పు, 65 టన్నుల గోధుమపిండి అందించాలి. కానీ బియ్యం, చక్కెర తప్ప మిగిలిన సరుకులేవీ కనిపించవు. అడిగినా సమాధానం ఉండదు. లేదా 'ఇచ్చింది తీస్కో' అనే బుకాయింపు వినిపిస్తుంది. ఈనెల సరుకులను పరిశీలిస్తే ఆశ్చర్యపోక తప్పదు. 286 టన్నుల చక్కెరకు కేవలం 130 టన్నులు మాత్రమే జిల్లా వ్యాప్తంగా పంపారు. 180 టన్నుల కందిపప్పుకుగాను 15 టన్నులు మాత్రమే పంపారు. అంటే 165 టన్నుల కందిపప్పు పంపిణీని ఎగ్గొట్టారు. గోధుమ పిండి కూడా 55 టన్నులకే పరిమితం చేశారు.


రోడ్డు మీద నిలబెడుతున్నారు



డోర్ డెలివరీ అంటే క్యూలైన్‌లో నిలబడే బాధ తప్పిందనుకున్నాం. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కానీ అసలు విషయం తెలియలేదు. మొదట్లో రేషన్ సరుకులన్నీ ఇంటికే వచ్చి ఇస్తారనుకున్నాం. సంతోషపడ్డాం. కానీ వ్యాన్ వీధిలో ఎక్కడో చోటకు వస్తోంది. అక్కడకు వెళ్లి నిలబడాల్సి వస్తోంది. ఇంతకుమందు రేషన్ షాపుల ముందు నిలబడేవాళ్లం. అయినా నిడబడటం, నిరీక్షణ మాత్రం తప్పలేదు.

-వాటంబేడు భాస్కర్

చేతన జీవుల చేతులు నిన్న 'గుర్తు'రేవా...




ఇన్నాళ్లూ నరకం చూపించి ఇప్పుడు ఎక్కడలేని ప్రేమా ఒలకబోస్తున్న అధికార వైసీపీ నేతల తీరు చూసి ప్రభుత్వోగులు అవాక్కయ్యారు. జీతాలు పడలేదంటే నిన్నమొన్నటి వరకూ వెకిలి నవ్వులు నవ్వి తాజాగా వంగి వంగి దండాలు పెడుతుంటే విస్తుపోయారు. ఆదివారం ఎస్వీఆర్ట్స్ కళాశాల కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు వచ్చిన ప్రభుత్వోద్యోగులను ప్రసన్నం చేసుకోడానికి వైసీపీ నేతలు 'గుర్తు' చెబుతూ ఆడిన నాటకాలు అన్నీఇన్నీ కావు. మండుటెండలోనూ చెమటలు కక్కుతూ తమను ఆకర్షించేందుకు వీరు చేసిన ప్రయత్నాలను చూసి ఉద్యోగులు ముసిముసిగా నవ్వుకున్నారు.

- తిరుపతిరూరల్

వీడు మనోడేనంటావా...

ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ నియోజకవర్గ ముఖ్యనేతను అనుమానం దహించేస్తోంది. ఎవరిని నమ్మాలో..ఎవరిని నమ్మకూడదో తేల్చుకోలేకపోతున్నారు. నమ్మి పెత్తనమిస్తే కొంప ముంచుతారేమోనని సంశమిస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మొదటి నుంచి కష్టపడిన, పట్టున్న నాయకులను పక్కన పెట్టి సొంత కోటరిని నిర్మించుకున్నాడాయన. ఏరికోరి కొత్తవారిని ఏకగ్రీవాలు చేయించుకున్నారు. ఇంకేముంది. అంతా తనవాళ్లేనని కాలర్ ఎగరేశారా ముఖ్యనేత. ఎన్నికలు సమీపించడంతో ఈమధ్య స్థానిక ప్రజాప్రతినిధులను తిరుపతికి పిలిపించుకున్నారు. ఓ హోటల్‌లో భారీ విందు ఇచ్చి బాగా పనిచేయాలన్నారు. పొగడ్తలతో ముంచెత్తారు. తర్వాతే ముఖ్యనేత అసలు స్వరూపం బయటపడింది. వీరందరినీ ఒకరికి తెలియకుండా మరొకరిని రూమ్‌లోకి పిలిపించుకున్నారు. పార్టీ పరిస్థితి, వీడిపోయే వారెవరు.. కోవర్టులున్నారా అంటూ ఆరా తీశారు. వీరంతా ఒకరిపై ఒకరు అనుమానాలను వెళ్లగక్కే.సరికి ఆ పెద్ద నాయకుడు అవాక్కయ్యారు. వీరందరి గురించి విచారణ మొదలుపెట్టారు. చేసేదిలేక అందరినీ అనుమానిస్తూనే ఇప్పుడు వార్డు,గ్రామాల్లో పంపకాలు బాధ్యతలు అప్పగించారు. అయినా అనుమానం పోలేదు. కీలక పంపకాలు సరిగా చేస్తారా లేదా అని సందేహిస్తూనే ఉన్నారు.

- రేణిగుంట





జగన్ నడిచిన దారి

ఇది సదుం- కలికిరి రోడ్డు. 2018లో ప్రతిపక్ష నేతగా జగన్ ఈ రోడ్డు మీదుగానే పాదయాత్ర చేశారు. సీఎం అయ్యాక రోడ్లపై తట్టెడు మట్టి పోయడాన్నే మరిచిపోయారు. కనీసం తాను నడిచిన దారినైనా బాగు చేయాలన్న ఆలోచన లేకుండా పోయింది. నాడు పాదయాత్రలో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలమైన సదుంలో జగన్ పాదయాత్ర చేశారు. పీలేరు నియోజకవర్గం కలికిరి నుంచి పాలమంద మీదుగా సదుంకు జగన్ పాదయాత్రగా వచ్చిన రోడ్డు ఇప్పటికీ సింగల్‌రోడ్డుగానే ఉంది. అనేక ప్రాంతాల్లో గోతులమయంగా దుస్థితిలో ఉంది. చింతమాకులపల్లె, పాలమంద, రెడ్డివారిపల్లెల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉండటమే కాక చెరువుకట్టపై రోడ్డు ప్రమాదకరంగా ఉంది. కలికిరిలో సైనిక్‌స్కూల్, జేఎన్‌టీయూ, వివిధ ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలున్నాయి. అలాగే కలికిరి-సదుం దూరం 17 కిలోమీటర్లు ఉండటంతో ఇరుమండలాల ప్రజలకు అనేక అవసరాలు ఉంటాయి. కానీ పెద్దిరెడ్డి మంత్రి అయినా కూడా ఈరోడ్డును పట్టించుకోకపోవడంపై విమర్శలున్నాయి.

- పుంగనూరు

→ అధ్వానంగా ఉన్న సదుం-కలికిరి రోడ్డు



బాగుండావాక్కా!

● ఇదీ సంగతి

'బాగుండావాక్కా.. బాగుండావా సెల్లీ, అన్నో బాగుండావా.. ఎక్కడుండేది మనం?' అంటూ క్షేమసమాచారాలు కనుక్కునే ఫోన్లు ఎక్కువైపోయాయప్పా ఇబ్బుడు. ఏందబ్బో ఇంత ప్రేమ అనుకుంటున్నారా? ఏమీ లేదు. ఎలచ్చన్లు వొచ్చేసినాయి గదా. అన్ని పార్టీల జాతకాలు బాగుండాలంటే ఇన్నేళ్లూ మరిచిపోయిన జనాలను గుర్తు పెట్టుకున్నట్లు నటించాల. అందుకే ఇదంతా రాజకీయ జీవుల పాట్లు. పార్టీలు ఇప్పటికే వార్డులవారీగా ఇన్‌ఛార్జిలను పెట్టేసి ఉండాయి. మున్సిపాలిటీ అయితే కౌన్సిలర్లు, పంచాయతీలు అయితే సర్పంచిలు, వార్డు మెంబర్లు, వీళ్లూవాళ్లూ కాకపోతే యూనిట్ ఇన్‌ఛార్జిలు. వీరికి ఓటరును పలకరించే బాధ్యతను అప్పగించేసినాయి. 'మీరేం జేస్తారో మాకు తెలీదప్పా. రేపు మీ బూత్‌లో ఓట్లు తగ్గితే పార్టీలో పుట్టగతులుండవు. ఇప్పుడే చెప్తావుండాం. అనాక మమ్మల్ని అంటే లాబంలేదు' అని గెట్టిగా వార్నింగ్ ఇచ్చేసినాయి. పల్లెల్లో అయితే ఎక్కడున్నోళ్లు అక్కడే ఉంటారు. కానీ టౌన్లల్లో అద్దెకుండే వాళ్లే ఎక్కువ. వాటిల్లో అరాకొరా వేతనాలతో బతికే బడుగు జీవులూ ఎక్కువే. ఈరోజు ఉండే ఈదిలో రేపు కనిపించని మనుషులు శానామందే ఉంటారు. అందుకని పార్టీలు నియమించిన ఇన్‌ఛార్జిలు పొద్దన్నే ఓటర్ల జాబితా లిస్టు ముందేసుకోని ఫోన్లు కొడతా వుండారు. 'నువ్వు ఫలానా కదా. మీరు ఇప్పుడు ఎక్కడుండారు? ఇంట్లో అంతా బాగానే ఉండారు గదా. మన పార్టీకే ఓటెయ్యాల మరిసిపోబాక. మళ్లీ ఇంటికొచ్చి కలస్తాంలేప్పా' అంటా అడ్రెస్‌లు, బాగోగులు కనుక్కునేదానికి మల్లుకున్నారు. రేపు 'పంపిణీలు' చేయాలన్నా ఓటర్ల అడ్రెసు తెలిసి ఉండాల గదా. అందుకన్నమాట. జనాలైతే అలా వొస్తావుండే ఫోన్ పలకరింపులకు మురిసిపోవడం లేదుకానీ, రేపు 'పంపిణీల'కోసం నన్ను గూడా గుర్తు పెట్టుకుండారు సాలు.' అని తృప్తి పడిపోతా వుండారు.


- కుప్పం

జన చైతన్యం

● వాహన శత్రు

'వాహన మిత్ర' అన్నారు. మూడింట ఒకటో వంతు మందికే ఏడాదికి రూ.10 వేలు ఇచ్చారు. వీరికి తెలియకుండానే.. వేర్వేరు మార్గాల్లో పది రెట్లు లాగేసుకున్నారు. ఇచ్చింది కొందరికైతే.. లాక్కుంది మాత్రం అందరి నుంచీ. ఇలా ఒకచేత్తో ఇచ్చి.. మరో చేత్తో లాగేసుకుని కూడా.. తాను ఆటో, ట్యాక్సీ యజమానులను ఉద్ధరించానంటూ ప్రతి సభలోనూ చెప్పుకోవడం సీఎం జగన్‌కే చెల్లింది. ఈ సాయం వెనుక మతలబు తెలుసుకుంటే రెక్కాడితేకాని డొక్కాడని డ్రైవర్లకూ జగన్ పెట్టిన వాతలేంటో అర్థమవుతుంది.

- చిత్తూరు సిటీ





● వాహన మిత్ర లబ్ధిదారులకు జగన్ కుచ్చుటోపి
● నిబంధనల పేరుతో లబ్ధిదారుల కోత
● నిత్యం అధిక జరిమానాలతో వేధింపులు

ఇచ్చింది 50 వేలు — గుంజింది 5.50 లక్షలు

ఆటోలు, ట్యాక్సీలకు బీమా, ఫిట్‌నెస్, రిపేర్ల కోసం రూ.10 వేలు ఇస్తానన్నది జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. జిల్లాలో ఆటో, ట్యాక్సీలు సుమారు 20 వేల వరకు ఉన్నాయి. కానీ సొంత వాహనం ఉన్న వారికే పథకం వర్తిస్తుందని నిబంధన పెట్టడంతో మూడింట ఒక వంతు వారికే పథకం దక్కింది. ఎందుకంటే.. వాహన యజమానుల కంటే ఆటోలను అద్దెకు తీసుకుని నడిపేవారి సంఖ్యే ఎక్కువ. కొందరు యజమానులకు నాలుగైదు ఆటోలు కూడా ఉంటాయి. సగటున నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించినవారు, మునిసిపల్ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ నివాసేతర వాణిజ్య భవనం కలిగి ఉన్నా, జీఎస్టీ కడుతున్నా, 3 ఎకరాల కంటే ఎక్కువ తడి / 10 ఎకరాల మెట్ట భూమి కలిగినవారు, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, పింఛనుదారులున్నా ఈపథకానికి అనర్హులు. దీంతో వేలాదిమంది వాహన యజమానులు పథకానికి అర్హత కోల్పోయారు. జిల్లాలో 20 వేల వరకు ఆటోలు, ట్యాక్సీలు ఉండగా, ఇన్ని కోతలేసి 2019-20లో 5,879 మందిని అర్హులుగా చేర్చారు. 2020-2021లో 6,674, 2021-22లో 6,105, 2022-23 లో 6,044, 2023-24లో 6,482 మంది వాహన యజమానులకు మాత్రమే వాహనమిత్ర ద్వారా నగదు అందజేశారు. ఇలా ఈ కొందరికి ఐదేళ్లలో రూ.50 వేలను ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం.. అందరి వద్దా రూ.5.50 లక్షలు వంతున లాగేసింది.

మా నుంచి లాక్కుందే ఎక్కువ

'జగన్ పాదయాత్రలో ఆటో డ్రైవర్లందరికీ డబ్బు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు వాహన యజమానికి మాత్రమే ఇచ్చారు. ఏటా క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలంటున్నారు. డ్రైవర్లకు డబ్బు ఇవ్వడానికి క్యాస్ట్ సర్టిఫికెట్‌తో ఏం పని? వాహనమిత్ర పథకానికి అప్లై చేయాలంటే ప్రతి ఏడాది ధ్రువపత్రాల కోసం చాలా కష్టపడాల్సి వస్తోంది. అలాగే ఏడాదికి రూ.10 వేలిచ్చి అనేక రకాలుగా మా వద్ద లక్షకు పైగా లాగేస్తున్నారు. పెట్రోల్, డీజల్ ధరలు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకంటే పది రూపాయలకంటే ఇక్కడ ఎక్కువగా ఉంది.'

- ఇది ఓ డ్రైవరు ఆవేదన

సాయం కొందరికి.. నష్టం అందరికీ

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుంతల రోడ్లే. ఆటోలను నడపలేకపోతున్నాం. తరచూ రిపేర్లు వస్తున్నాయి. వాహనమిత్ర పథకం అందరికీ రాలేదు. కొంతమంది ఓనర్లకే వచ్చింది. డ్రైవర్లకు ఎలాంటి ఉపయోగం లేదు. ఒక్కోసారి రోజంతా కష్టపడి ఆటోకు అద్దె చెల్లించి ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఈ పథకం వల్ల కొంతమందికే లాభం చేకూరింది. నష్టం మాత్రం అందరికీ కలుగుతోంది.

- మరో ఆటో డ్రైవర్ బాధ ఇది.

డీజల్ రూ.2.16 లక్షలు లాగేసి..



రాష్ట్రంలో పెట్రోలు, డీజల్ ధరలు పొరుగున ఉన్న కర్ణాటకతో పోలిస్తే కనీసం రూ.12 ఎక్కువ. ఒక రోజుకు సగటున ఒక ఆటో డ్రైవర్ 10 లీటర్ల డీజల్ వినియోగిస్తారు. లీటరు మీద రూ.12 చొప్పున రోజుకు రూ.120, నెలకు రూ.3600.. ఏడాదికి రూ.43,200.. ఐదేళ్లకు రూ.2.16 లక్షలు నష్టం కలుగుతోంది. అంటే జగన్ ఈ ఐదేళ్లలో రూ.50 వేలు ఇచ్చి ఒక్క డీజల్ ద్వారానే రూ.2.16 లక్షలు లాగేసుకున్నారన్న మాట.

జరిమానా ఒక్కొక్కరిపై రూ.1.50 లక్షలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు పత్రాలు సరిగా లేకపోయినా రవాణాశాఖ అధికారులు, పోలీసులు కాస్త ఉదారంగా ఉండి హెచ్చరించి నామమాత్రపు జరిమానా వేసేవారు. జగన్ ప్రభుత్వంలో అధికారులు డ్రైవర్లను బాగా ఇబ్బంది పెట్టారు. చిన్న పొరపాటుకు కూడా భారీ జరిమానా విధించారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 2020లో రవాణా నిబంధనల ఉల్లంఘనకు జరిమానాలను పెంచింది. వీటిపై ఏ రాష్ట్రమూ ముందుకు వెళ్లకపోయినా జగన్ ప్రభుత్వం మాత్రం అమలుకు ఉత్తర్వులిచ్చింది. అనేక జరిమానాల రూపంలో సగటున ఒక్కో డ్రైవర్‌కు ఏడాదికి రూ.30 వేలు పడుతోంది. ఐదేళ్లలో రూ.1.50 లక్షలవుతోంది.



జరిమానా తేడాలు అప్పుడు.. ఇప్పుడు

● టీడీపీ హయాంలో సగటున జరిమానా రూ.130కి మించేది కాదు. ఖాకీ షర్టు లేకపోయినా, సిగ్నల్ జంపింగ్, పొరపాటున రాంగ్ పార్కింగ్ చేసినా, ఆటో డ్రైవర్ పక్కన కూర్చున్నా టీడీపీ ప్రభుత్వంలో రూ.130 జరిమానా విధించేది. ఇప్పుడు జగన్ ప్రభుత్వం రూ.1350 వసూలు చేస్తున్నారు. పర్మిట్ లేకుంటే ఏకంగా రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు.



గుంతల రోడ్లతో రూ.1.80 లక్షల ఖర్చు

రహదారుల నిర్వహణకూ జగన్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఈ ఐదేళ్ల రహదారులు ఛిద్రమైపోయాయి. రోడ్ల మీదున్న గుంతలు పూడ్చే పరిస్థితి కూడా లేదు. గుంతలమయమైన ఈ రోడ్లలో ఆటోలు నడుపుతుంటే టైర్లు దెబ్బతింటున్నాయి. 40 వేల కిలో మీటర్లు రావాల్సిన టైర్ల జీవితకాలం 30 వేల కిలోమీటర్లకే పడిపోతోంది. తరచూ పంచర్లవుతున్నాయి. ఇక, మూడేళ్లు రావాల్సిన బేరింగులు ఏడాదికే అరిగిపోతున్నాయి. గతంలో లీటరు డీజల్‌కు 30 కిలోమీటర్లు ఇచ్చే మైలేజి.. అధ్వాన రహదారులతో ఇప్పుడు 25 కిలోమీటర్లకు పడిపోయింది. ఆటో నిర్వహణ ఖర్చు నెలకు సుమారు రూ.3 వేలు దాటుతోంది. ఇలా వాహనాల మరమ్మతులకు ఐదేళ్లలో రూ.1.80 లక్షలు ఖర్చవుతోంది. వాహనమిత్ర పథకం దేవుడెరుగు.. ముందు రోడ్లు బాగుచేస్తే బాగుండునని చాలామంది డ్రైవర్లు అంటున్నారు.



తాగునీటి పైపులైన్ల వద్ద నిలిచిన మురుగునీరు



దెబ్బతిన్న కాలువ, చెత్తాచెదారంతో ఆగిన మురుగుతో దుర్గంధం - కొళాయిలు అమర్చక పైపులతోనే తాగునీటి సరఫరా



● గుర్తుందా మేడం

ఇది మీ దత్తత గ్రామమే

మీరాసాహెబ్‌పాళెం.. నగరి మండల పరిధిలో వందకుపైగా ఇళ్లున్న గ్రామమిది. దీనిని మంత్రి రోజా దత్తత తీసుకున్నారు. ఇంకేముంది.. అద్భుతంగా మౌలిక వసతులు సమకూరి.. అభివృద్ధిలో జిల్లాలకే ఆదర్శంగా తమ గ్రామం నిలుస్తుందని గ్రామస్థులంతా భావించారు. సంతోషపడ్డారు. కానీ, మంత్రి దత్తత తీసుకున్నాక కేవలం రెండు సిమెంటు రోడ్లు వేశారు. వీధి దీపాలు ఏర్పాటు చేశారంతే. మిగతా వసతులు కల్పించలేదు. ముఖ్యంగా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దెబ్బతిన్న కాలువకు తోడు.. చెత్తాచెదారం చేరి మురుగు కదలడంలేదు. దీంతో దుర్గంధం నెలకొంది. దోమల బెడద ఎక్కువైంది. గ్రామంలోకి వెళ్లే సిమెంటు రోడ్డు పక్కన మురుగునీరు చేరిపోయి ఉంది. ఇలా కనీస వసతుల్లేక వీరంతా సతమతమవుతున్నారు. మరోవైపు ఈ గ్రామంలోని 52 మందికి జగనన్న కాలనీలో పక్కాగృహాలను మంజూరు చేశారు. అందులో 51 ఇళ్లను కాంట్రాక్టర్లు.. ఒక ఇంటిని లబ్ధిదారే నిర్మించుకున్నారు. ప్రభుత్వం పక్కా గృహానికి మంజూరు చేసిన 1.80 లక్షలకు సిమెంటు రాళ్లతో గోడలు కట్టి మోల్డింగు వరకు వేసి వదిలేశారు. ఆ డబ్బు అంత వరకే వస్తుందని ఆపై పూతపని, ఇతర పనులను లబ్ధిదారులే చేసుకోవాలని కాంట్రాక్టర్లు చెప్పారట. దీంతో కొందరు అప్పు చేసి ఇళ్లను పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారు అలాగే వదిలేశారు. 15 మందికిపైగా ఆ కాలనీలో నివాసం ఉంటున్నారు. కనీసం రోడ్డుకూడా ఇప్పటికీ ప్రభుత్వం వేయలేదు. తాను దత్తత తీసుకున్న గ్రామంలోని వారికి ఇచ్చిన కాలనీలో మౌలిక వసతుల విషయంలోనూ మంత్రి రోజా చొరవ తీసుకోకపోవడం గమనార్హం. ఇక, తాగునీటి పైపులైన్లకు కొళాయిలు అమర్చలేదు. పైపులతో నీటిని పట్టుకుంటున్నారు. ఇక్కడి సమస్యలను ఎవరికైనా చెప్పాలన్నా స్థానికులు భయపడే పరిస్థితి. ఈ విషయం వాళ్లకు తెలిస్తే తమకు ఇబ్బంది అంటూ సమస్యలు చెప్పడానికీ వారంతా వెనకడుగు వేస్తున్నారు. అన్నా ఏమీ అనుకోవద్దు అంటూ వెళ్లిపోతున్నారు.

- నగరి

15 ఏళ్ల కిందట ఆవిర్భావం

మూడు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల కలయికతో 15 ఏళ్ల కిందట గంగాధరనెల్లూరు (ఎస్సీ రిజర్వు) నియోజకవర్గం ఏర్పాటైంది. ఒకప్పుడు గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పెనుమూరు, గుడిపాల., చిత్తూరు మండలంలోని కొన్ని పంచాయతీలు కలిపి వేపంజేరి నియోజకవర్గంగా ఉండేది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వేపంజేరి రద్దయింది. అందులోని మండలాలను కొత్తగా ఏర్పాటైన గంగాధరనెల్లూరు, పూతలపట్టులో కలిపారు. అలా.. వేపంజేరి నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పెనుమూరు.. పుత్తూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం, పాలసముద్రం, శ్రీరంగరాజపురం.. నగరి నియోజకవర్గంలోని కార్వేటినగరం మండలాలతో గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఏర్పాటైంది.

సంవత్సరం	ఎమ్మెల్యేలు	పార్టీ
2009	గుమ్మడి కుతూహలమ్మ	కాంగ్రెస్
2014	కె.నారాయణస్వామి	వైసీపీ
2019	కె.నారాయణస్వామి	వైసీపీ

ఎన్నికలు జరిగింది: మూడుసార్లు. కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇప్పటి వరకు తెలుగుదేశం ప్రాతినిధ్యం లేదిక్కడ.

విశేషాలు

● మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కుతూహలమ్మ, రెండో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు.
● రెండుసార్లు గెలిచి.. డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామి మూడోసారి పోటీలో లేరు. ఆయన కుమార్తె బరిలో ఉన్నారు
● మూడు ఎన్నికల్లోనూ టీడీపీ తరఫున అభ్యర్థులను మారుస్తూ వచ్చారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్న టీడీపీ.. డాక్టర్ థామస్‌ను అభ్యర్థిగా నిలిపింది.

● గంగాధరనెల్లూరు చరిత్ర

మొత్తం ఓటర్లు: 2,04,669
పురుషులు: 1,01,697
మహిళలు: 1,02,966
ఇతరులు: ఆరుగరు

- వెదురుకుప్పం/జీడీనెల్లూరు



శ్రీకాళహస్తి
సత్యవేడు

నీడా లేదు.. నీళ్లూ లేవు
అవస్థల నడుమ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



మండుటెండలో ఓటు వేసేందుకు నిరీక్షిస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి, మే 5: శ్రీకాళహస్తిలో ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ శివారు పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఉన్న స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. రహదారిపై నుంచి కళాశాల భవనంలోకి సుమారు 300 మీటర్ల దూరం ఉండడంతో ఎండలో నడిచి వెళ్లేందుకు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్ విధానం సక్రమంగా అమలు చేయలేదు. కనీసం నీడ కల్పించకపోవడంతో ఎండలోనే గంటలు తరబడి ఓటర్లు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. కుర్చీలు, తాగునీటి వసతి కూడా కల్పించలేదని పలువురు వాపోయారు. కాగా, మొత్తం 2467 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం 1592 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 65 పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి వెల్లడించారు.

పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ ప్రచారం

వైసీపీ నేతలు పోలింగ్ కేంద్రం వద్ద పార్టీ కండువాలు ధరించి ప్రచారానికి దిగారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రయత్నాలు చేశారు. ఇది గమనించిన టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ నేతలు పార్టీ కండువాలను పక్కన పెట్టారు. ఓటర్లను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే చోట వైసీపీ నాయకులు సుమారు 50 మందికి పైగా తిష్ట వేశారు. మెడలో పార్టీ కండువాలు ధరించిన వైసీపీ నేతలు ఓటర్లను భయపెట్టి ప్రభావితం చేసేలా గట్టిగా అరుస్తున్నారని, అంతమందిని భారీకేడ్ల వద్దకు ఎందుకు అనుమతించారంటూ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి పోలీసు అధికారులను ప్రశ్నించారు. దీంతో పోలీస్ అధికారులు స్పందించి పరిమిత సంఖ్యలోనే ఇరు పార్టీల శ్రేణులు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

సత్యవేడులో 57 శాతం పోలింగ్

సత్యవేడు, మే 5: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కానున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1366 ఉండగా తొలిరోజు ఆదివారం 779 మంది (57 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు.

వసతులు కరువు... ఓటర్ల అసహనం

పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సత్యవేడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తొలుత రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సరైన వసతులు లేకపోవడం, గంటలు తరబడి క్యూలో ఉండడం, మంచినీరు, సరైన గాలి వెలుతురు లేకపోవడంతో ఉద్యోగస్తులు నానా అవస్థలు పడ్డారు. సరైన వసతులు లేకపోవడంతో కొందరు ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోకుండానే ఇంటిదారి పట్టారు. క్యూలో నిలబడ్డ ఉద్యోగస్తులు ఒక దశలో ఆర్వో డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో మధ్యాహ్నం తరువాత అధికారులు మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి: చింతా మోహన్

వరదయ్యపాళెం, మే 4: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి తనను ఎంపీగా గెలిపించాలని డాక్టర్ చింతా మోహన్ ప్రజలను కోరారు. వరదయ్యపాళెం చెంగాళమ్మ ఆలయం నుంచి ట్రంకు రోడ్డు వరకు శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. ఎంపీగా తనకు, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బాలగురవం బాబుకు ఓట్లు వేసి గెలిపిచాలన్నారు.

టీడీపీలో చేరికలు

రేణిగుంట, మే 5: పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన మేరీ చైనత్యబాబు, దినేష్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి బొజ్జల రిషితారెడ్డి సోదరి అమృత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం ఉదయం చర్చి వీధిలో, సాయంత్రం పోస్టాఫీస్ వీధిలో ప్రచారం నిర్వహించారు.

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం గ్రామానికి చెందిన యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి మాజీ సర్పంచు నిరంజన్‌బాబు నాయుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా ప్రదోష నంది సేవ

శ్రీకాళహస్తి, మే 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ప్రదోష నందిసేవ ఘనంగా జరిగింది. త్రయోదశి తిథిని పురస్కరించుకుని సాయంత్రం ఆలయంలో స్వామివారికి విశేష ఉత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ప్రదోష నందిపై స్వామివారి మూర్తిని కొలువుదీర్చారు. ధూప, దీప, నైవేద్య హారతులను సమర్పించారు. అనంతరం ఆలయం లోపల ప్రదోష నంది సేవలో ప్రాకారోత్సవంగా నిర్వహించారు. తిరిగి ఆలయంలో కొలువుదీర్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.



నిరంకుశ పాలనకు చరమగీతం పాడండి



టీడీపీలో చేరిన వారితో బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 5: వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని రాంబట్లపల్లి, కాసరం, పిల్లమేడు, జీవనం, చేమూరు, చోడవరం, విరుపాక్షపురం, గుండేలి గుంట గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు భూకబ్జా బాధితులు తమ సమస్యలను సుధీర్ రెడ్డికి విన్నవించారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే భూకబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఆయా గ్రామాల్లోని స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో భవన నిర్మాణ కార్మికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 300 మంది కార్మికులు టీడీపీలో చేరారు. వారికి సుధీర్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ప్రసాద్ నాయుడు, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని కోట్రమంగళం గ్రామంలో బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అక్కడ చిన్నకారు రైతులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి రాగానే చిన్నకారు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రోమల రాజేష్‌రెడ్డి, దేవేదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళా సాధికారత

ఏర్పేడు: చంద్రబాబు తోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. ఏర్పేడు మండలం మునగలపాళెం గ్రామంలో ఆమె తన కోడలు బొజ్జల రిషితారెడ్డితో కలిసి ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో మహిళలంతా మహిళలంతా టీడీపీని ఆదరించి బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు.సర్పంచు మంజుభార్గవి, నాయకులు ధనంజయులు నాయుడు, వేణుగోపాల నాయుడు, మోహన్‌రావు, బాలాజీ నాయుడు, తిరుమలయ్య, గురవారెడ్డి, సతీష్‌నాయుడు, నాగరాజు నాయుడు, శంకర్ నాయుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బొడుగు మునిరాజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల రిషితారెడ్డి

అవినీతిపరుడైన జగన్‌ను గద్దె దించాలి
తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు



మీడియాతో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద రావు

సూళ్లూరుపేట/వెంకటగిరి/శ్రీకాళహస్తి, మే 5: అవినీతి పరుడైన సీఎం జగన్‌ను గద్దె దించాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం జగన్ కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా చేశాడన్నారు. వ్యవస్థలు సర్వనాశనమై పోయాయని ఇవన్నీ చక్కబడి రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే సీఎంగా చంద్రబాబుని గెలిపించాలని కోరారు. పేదలకు పించన్ అందకుండా చేస్తున్న జగన్‌ను తరిమికొట్టాలని కోరారు. ఇది చాలక ఇప్పుడు రైతుల పొలాలపై పడ్డాడని అటువంటి జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే నేటికీ కనబడుతోందే తప్ప గత ఐదేళ్లల్లో నయాపైసా పని జరగలేదని విమర్శించారు. టీడీపీ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, చిట్టేటి పేరుమాల్, బుద్ది విజయలక్ష్మి, జనసేన నాయకుడు రమణ, వల్లూరు రాజా తదితరులు పాల్గొన్నారు.

కాపు సోదరులతో ఆత్మీయ సమావేశం

వెంకటగిరిలోని ఎస్ఆర్‌గార్డెన్, శ్రీకాళహస్తిలోని మహేష్ కల్యాణ మండపాల్లో బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వరప్రసాదరావు హాజరయ్యారు. జనసేన అధినేత పవన్ నిస్వార్థంగా రాజకీయాల్లోకి వచ్చారని, అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. తనకు చిరంజీవి కుటుంబంతో మొదటి నుంచీ మంచి సంబంధాలు ఉన్నాయని, అందుకే 2009లో తాను ప్రజారాజ్యంలో పని చేశానని గుర్తుచేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నేత కోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



బలిజ సంఘ నాయకులతో సమావేశమైన వరప్రసాద్

పెట్రోల్ బంకు వద్ద టాటా సుమోలో మంటలు



ఏర్పేడు, మే 5: ఏర్పేడు మండలం పల్లం పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఓ టాటా సుమోలో నుంచి ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. దీంతో పెట్రోల్ బంకు సిబ్బందితో పాటు పల్లం, గొల్లపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఒడిశాకు చెందిన కొంతమంది భక్తులు రెండు సుమోల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం బయలుదేరి వచ్చారు. పల్లం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఒక టాటా సుమో మరమ్మతులకు గురైంది. దీంతో ఆ వాహనాన్ని అక్కడే వదిలేసి మరో వాహనంలో తిరుమలకు వెళ్లారు. ఆదివారం ఉన్నట్లుండి టాటా సుమోలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్డీఏ కూటమిని గెలిపించండి



పెరిందేశంలో పర్యటిస్తున్న ఆదిమూలం

కేవీబీపురం, మే 5: ఎన్డీఏ కూటమిని గెలిపించాలని ఆ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం కోరారు. ఆదివారం కేవీబీపురం మండలంలోని పెరిందేశం, రాగిగుంట, మఠం, రాజులకండ్రిగ, రంగయ్యగుంట, పూడీ సీకేపురం, కాట్రపల్లి, కళత్తూరు, ఎస్ఎల్‌పురం గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పెరిందేశం గ్రామానికి చెందిన వైసీపీ యువనేత రజనీకాంత్ తన అనుచరులుతో కలిసి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో రామాంజులు నాయుడు, గోపినాథ్‌రెడ్డి, మునిస్వామి యాదవ్, కిరణ్‌యాదవ్, వెంకటకృష్ణయ్య, వరలక్ష్మి, పావని, మునిలక్ష్మి, సురేష్‌రెడ్డి, నాగరాజునాయుడు, బీజేపీ నాయకులు మునిశేఖర్, కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ముక్కంటి ఆలయ ఉద్యోగి



శ్రీకాళహస్తి, మే 5: వైసీపీ ఎన్నికల ప్రచారంలో గణపతిరాజు అనే ముక్కంటి ఆలయం ఒప్పంద ఉద్యోగి పాల్గొనడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రూ.500 రాహు-కేతు సర్ప దోష పూజ మండపంలో గణపతిరాజు ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తుంటారు. ఆయన వైసీపీ నేతలతో అత్యంత సన్నిహితంగా మెలుగుతుంటారన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. శనివారం రాత్రి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి పట్టణంలోని కైలాసగిరి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో పాల్గొన్న గణపతిరాజు ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై ఎన్డీఏ కూటమి నేతలు ఎన్నికల అధికారులకు, ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేశారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విధుల నుంచి తప్పించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

◄ వైసీపీ నేత పవిత్రారెడ్డికి కండువా కప్పుతున్న ముక్కంటి ఆలయ ఉద్యోగి గణపతిరాజు

కదం తొక్కిన కాపులు
వైసీపీకి బుద్ధి చెబుతామంటూ ముక్తకంఠంతో నినాదం



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 5: ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామంటూ కాపు సామాజిక వర్గం ప్రజలు కదం తొక్కారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ గెలుపు కోసం మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పలమాల సుధాకర్ విస్తృతంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. పట్టణంలోని మహేష్ కల్యాణ సదన్‌లో ఆదివారం బలిజ ఆత్మీయ సభను భారీ ఎత్తున నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కూటమి అభ్యర్థులు బొజ్జల సుధీర్ రెడ్డి, వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లమాల సుధాకర్ మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాపుల అభ్యున్నతి కోసం 5 శాతం ఈ బీసీ కోటా ప్రతిపాదన ఆమోదించారని చెప్పారు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని విస్మరించి కాపులను పూర్తిగా దగా చేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బలిజలకు 5 శాతం రిజర్వేషన్ కోసం అభ్యర్థులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గానికి 25నుంచి 30శాతం స్థానాలు కేటాయించాలని కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలో బలిజ భవనం నిర్మాణం కోసం కార్పొరేషన్ ద్వారా రూ.కోటి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... తన తండ్రి దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి కాపుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని వివరించారు. తండ్రిని మరిపించేలా బలిజ ప్రజలందరికీ అండగా ఉండి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ మాట్లాడుతూ.... శ్రీకాళహస్తిలో కాపులు తనకు గతంలో కూడా అండగా నిలిచారని సంతోషం వ్యక్తం చేశారు. అదే ఆదరణ మళ్లీ చూపితే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆత్మీయ సభలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, సిద్ధులు గారి ప్రసాద్, పగడాల సుధాకర్, బీజే ప్రసాద్, కాసరం రమేష్, కంటా రమేష్, కొట్టేసాయి, నరసయ్య, గోపాలకృష్ణ, ఏర్పేడు మండల బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్, జనసేన అధ్యక్షుడు కిరణ్ రాయల్, కనపర్తి ప్రసాద్, మేఘవర్ణం, పల్లమాల శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లమాల సుధాకర్



ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌తో పల్లమాల సుధాకర్ తదితరులు

పుత్తూరు వార్తలు

పోస్టల్ బ్యాలెట్‌లో 83 శాతం పోలింగ్

పుత్తూరు అర్బన్, మే 5: పట్టణంలోని బాలకల ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి ప్రారంభమైన సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ తొలిరోజు 83 శాతం నమోదైంది. నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు పుత్తూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. ఆదివారం మొత్తం 1150 ఓట్లుకు గాను 955 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజా పోలింగ్ సరళిని పరిశీలించారు. నగరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

వైసీపీని తరిమికొట్టండి

పుత్తూరు అర్బన్, మే 5: నగరి నియోజకవర్గం నుంచి వైసీపీని తరిమికొట్టాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని శిరుగురాజుపాళెంలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు అబద్ధపు హామీలతో గెలుపొందిన వైసీపీ నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టించిందని ధ్వజమెత్తారు. దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి తప్ప పేదలకు ఒరిగిందేమీ లేదని తేల్చిచెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి భానుప్రకాష్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాద్‌రావును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుణాయాదవ్, రవికుమార్, బాలాజీ పాల్గొన్నారు.

విజయపురం... ఉరిమింది

- ఏకమైన రోజా వ్యతిరేక శక్తులు
- భానుప్రకాష్‌కు మద్దతు
- చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్న నేతలు



సమావేశంలో గాలి భానుప్రకాష్‌తో రోజా వ్యతిరేకవర్గం నాయకులు

పుత్తూరు అర్బన్, మే 5: విజయపురం కన్నెర్ర చేసింది.... ఐదేళ్లుగా గూడుకట్టుకుని ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అధికారాన్ని ఆలంభనగా చేసుకుని ఐదేళ్లుగా కళ్లెదుటే జరిగిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలపై రగిలిపోయింది. మంత్రి రోజా, ఆమె కుటుంబసభ్యుల నుంచి నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు అండగా నిలవాలని ప్రతినబూనింది. రోజాను ఓడించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఇందుకుగాను త్వరలోనే అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటామని రోజా వ్యతిరేక వర్గం స్పష్టం చేసింది. ఆదివారం విజయపురం కేంద్రంగా జరిగిన ఆత్మీయ సమావేశంలో వైసీపీ అభ్యర్థి రోజాపై ఉరుములు, మెరుపులతో కూడిన వాగ్బాణాలను సంధించింది. ఎన్నికల రణరంగంలో రోజాకు అపజయాన్ని రుచిచూపేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరింది.

ఏకమైన అన్ని శక్తులు

స్వపక్షం, విపక్షం తేడా లేకుండా నియోజకవర్గంలోని అన్ని శక్తులు ఏకమయ్యాయి. నాలుగు దశాబ్దాల పైబడి కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక నాయకులుగా వ్యవహరించి, ఆ తరువాత వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్న నాయకులు మంత్రి రోజాకు వ్యతిరేకంగా టీడీపీ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే పుత్తూరుకు చెందిన డీఎన్ ఏలుమలై మొదలియార్ పసుపు కండువా కప్పుకోగా, ఆదివారం నిండ్రకు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, విజయపురంకు చెందిన లక్ష్మీపతిరాజు అదే బాట పట్టనున్నట్లు విజయపురం మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో తమ అనుచరులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రకటించారు. వీరితో పాటు స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరై రోజా వ్యతిరేక వర్గం రాకను ఆహ్వానించడం వైసీపీని డిఫెన్స్‌లో పడేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ వర్గాల్లో గుబులు

2014, 2019 ఎన్నికల్లో నగరి ఎమ్మెల్యేగా రోజా గెలుపునకు వెన్నుదన్నుగా నిలిచిన నాయకులు ఈ దఫా ఆమె ఓటమికి కృషి చేస్తామని చెప్పడం వైసీపీ వర్గాల్లో గుబులు పుట్టిస్తోంది. ఆమె కుటుంబ అవినీతి, అక్రమాలు, అవమానాలు భరించలేకే పార్టీ వీడాల్సి వచ్చిన విషయాన్ని సమావేశంలో తేటతెల్లం చేశారు. నగరి నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు సమర్థుడైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు వెల్లడించారు.

జోష్ మీదున్న టీడీపీ

ఇప్పటి వరకు డిఫెన్స్ గేమ్ ఆడిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక వ్యూహాన్ని మార్చుకున్నారు. వైసీపీపై ఎటాకింగ్ పాలిటిక్స్‌కు దిగారు. గత రెండు ఎన్నికల్లో రోజా గెలుపునకు కీలకంగా మారిన నాయకులే టార్గెట్‌గా రాజకీయ వ్యూహాలు పన్నారు. నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలనే సదుద్దేశంతో చేతులు కలపాలని వైరి వర్గ నేతలతో సంప్రదింపులు జరిపి తనవైపునకు తిప్పుకోగలిగారు. ఈ వ్యూహం ఫలించడంతో వైసీపీకి నగరిలో పునాదులు కంపిస్తున్నాయి. అన్ని అనుకూలంగా మారుతుండడంతో టీడీపీ శ్రేణులు ఫుల్ జోష్ మీదున్నాయనే చర్చ జరుగుతోంది.